# ఆత్మార్పణ

ఆ సంవత్సరం క్రిస్మసులో శీతానగరం లక్ష్మణరావుగారి బట్టల మిల్లులో కలుసుకున్నారు మిత్రులు. ప్రతి సంవత్సరం క్రిస్మసులోనూ కలుసుకుంటారు దాదాపు ఆ వందమందీ. వాళ్ళు చిన్నప్పుడు ఓసారే ఆ కాలేజీలో ఇన్‌టర్ చదువుకున్నారు. అదీ సంబంధం వాళ్ళ మధ్య. చెదిరిపోయి, అనేక వృత్తులలో, దూరపు వూళ్ళల్లో వున్న వాళ్ళంతా ప్రతి డిశంబరులోనూ ఓ చోట చేరతారు.

ఆ ఉదయం మంచుని చీల్చుకుని సూర్యుడు అప్పుడే తన విజయానందాన్ని ఆ వందమంది హృదయాల్లోనూ పలికించుకుంటున్నాడు. కాఫీలైనాయి. కొందరు స్నానానికి కృష్ణ కాలవకి వెళ్ళారు. కొందరు కిష్ణకే వెళ్ళారు. సుకుమారులు స్నానాల గది దగ్గిర టర్ను కోసం కూచున్నారు. వాళ్ళలో కొందరు లక్షాధికారులు, కొందరు ఇక్కడికి వొచ్చేందుకు కూడా డబ్బుకోసం వెతుక్కోవలసినంత పేదవాళ్ళు, అధికారులూ, వారి కింది గుమాస్తాలూ, అన్ని కులాలవాళ్ళూ, మతాలవాళ్ళు. ఆ వారంరోజులు మాత్రం భేదాన్నీ హెచ్చుతగ్గుల్నీ దూరంగానన్నా పాటించడానికి వీల్లేదు. సభికుల్ని రంజింప చెయ్యడానికి, గుమాస్తా పెద్దపులి వేషం వేసుకుంటే, జడ్జీ తోక ఎత్తిపట్టాలి. సిరద్దారు డోలు కొట్టాలి. ఇంజనీరు భోగం ఆట ఆడితే, వోవర్సీరు తల్లి వేషం, పెద్ద రైతు మద్దెల వాయించాలి.

వాళ్ళ అల్లర్లూ, Practical jokes, వేళాకోళాలు, ఒకరి మీద ఒకరు సిగ్గుపరిచే కథలు, విమర్శలు, చర్చలు-తెల్లారకట్ట అయిదింటినించి, పన్నెండుదాకా విరామం వుండదు. ఆ వుదయం డాక్టరు కాంతారావూ,

బోర్డు ఆఫీసరు సయ్యద్, గంగరావి చెట్టు కింద కూచుని మాట్లాడుకుంటున్నారు. రాత్రి ఎవరో సయ్యద్ గడ్డాన్ని సగం కత్తిరించారు గనక, అతన్ని గుర్తుపట్టడం కొంచెం ప్రయత్న పూర్వకంగా వుంది. ఆ కత్తిరించిన సగం గడ్డం పొద్దున నారాయణ దీక్షితుల నీరుగావి పంచ మడతలో కనపడ్డది. హాస్యం శృతిమించుతోందని పించింది సయ్యద్‌కి కొంచెం కోపంగా వున్నాడు. పైగా అతనికి నిద్రలో మొన్న ఎవరో పంగనామాలు తీర్చారు అతని నుదుటి మీద.

"క్లాసులోకి పంగనామాలు పెట్టుకొచ్చాడు, మొహమంతా నిండేట్టు-అతని పేరేమిటి ? – ఏమైనాడు అతను ? మీవూరే కాదూ?" అన్నాడు.

"అతనా ? అతను శ్రీధర్. అతని సంగతులేవో విచిత్రంగా చెప్పుకున్నారబ్బా ! పాపం చచ్చిపోయినాడేమో ! నేను మావూరికి వెళ్ళి ఎన్నో ఏళ్ళయిందనుకో. అతని సంగతీ............ మాణిక్యానికి తెలుసు బాగా. వుండు మాణిక్యన్ని పిలుద్దాం." అని దూరంగా స్నానంచేసి వొస్తున్న ఓ గుంపుని కేకేశాడు.

"ఒరే, మాణిక్యం ఎక్కడరా, కనపడితే రమ్మనండి" అని.

ఎండలో మెరుస్తున్న గడ్డిపూలకేసి చూస్తో సయ్యద్ అన్నాడు-

"శ్రీధర్ వుంటే ఈ సభలు ఇంకా ఎంత రమ్యంగా వుండేవో! మనందరం ఓ ఎత్తు, అతను ఓ ఎత్తనుకో."

"అతను బతికివుంటే మాత్రం ఈ సభలకి ఎట్లా వొచ్చేవాడు?"

"ఏం?"

"కాంగ్రెసు నాయకుడైనాడు తెలుసా ? జైదుల్లో వుండేవాడు."

"కాంగ్రెసులో చేరాడా ? పాపం !"

"పాపం ఏం ? అది అంత...."

"ఇంక పట్టుకోకు మరి. గొప్పదేనయ్యో మీ కాంగ్రెసు అయినా గవర్నమెంటు డాక్టరుకి నీకు కాంగ్రెసేమిట్లే! నేననేదేమిటంటే శ్రీధర్‌ని తలుచుకో. పరీక్షల్లో, స్పోర్ట్సుల్లో, డిబేట్‌లో, అన్నిట్లోననుకో, అతనే కద మొదటివాడు. అట్లాంటి మనిషిని చూడం. అతని రూపమో! లెక్చరు వినకండా అతని వంక అట్లా చూసేవాణ్ణి. అతనికి అక్కా చెల్లెలా వుంటే...."

"వుంటే? తురకాడికి నీకేం లాభం?"

"ప్రతిదానికీ అట్లా కరుస్తావెందుకు? నేనేమన్నాను? ఉంటే ఎంత అపరూపమైన అందం వుండేదోనని. కాని అట్లాంటివాళ్ళు బతకరులే. అతను సాధించలేనిదీ...."

మాణిక్యం శ్రేష్ఠి. కాంగ్రెసువాదీ, ధనికుడు వొచ్చాడు.

"ఏమిటోయ్ కేక వేస్తున్నారట! చూశావా, శర్మ, నా కూజాలో రెండు కప్పపిల్లల్ని పడేశాడు. రానీ చెబుదా వాడి పని."

"మాణిక్యం, శ్రీధర్ బతికివున్నాడా?"

"తెలీదా మీకు? ఒకే కథ. బతికి వున్నాడేమో! తెలీదు."

"తెలీదేమిటి? అతనికి మన వూళ్ళో పెద్ద ఆస్తికదూ?"

"అవును."

"పిల్లలా."

"అవును; భార్యా పిల్లలూ, ఆస్తీ అన్నీ ఉన్నాయి మా వూళ్ళోనే."

"అతను?"

"అతనే లేడు."

"మరి వాళ్ళకి తెలీదా?"

"తెలీదు ఏమైనాడో."

"అసలు కథేమిటి?"

"చెబుతా. శర్మ పెట్టె ఏదో నీకు తెలుసా?"

"చూపిస్తాలే ముందు మాకు కథ చెప్పు."

"అంతా నాకు తెలీదు తెలిసింది చెబుతాను. మరి శర్మ పెట్టెలో... ఇట్లారా చెబుతా. సయ్యదు చెప్పేస్తాడు."

"వాస్తాలే. ముందు మాకు శ్రీధర్ సంగతి చెప్పు."

"చెబుతా గాని, కాంతారావు, నాకు రాత్రులు అరికాలు మంటలోయ్ ఏం మందు చెబుతావు?"

కాంతారావు నవ్వుతున్నాడు.

"రాత్రికి నిద్రలో మంత్రం వేస్తాలే, ఇప్పుడు కానీ,"

"మీరు నమ్మరు నా కథ. ఏదో పుస్తకంలోంచి చెపుతున్నాననుకుంటారు."

"కోమటి అతని మాటల్ని ఎప్పుడూ శంకించం ఒక్క గల్లా పెట్టె ముందు తప్ప."

"శ్రీధర్ కాంగ్రెసు ఉద్యమంలో చేరాడని తెలుసునుగా."

"అవునులే, అతని పేరే వినలేదే ఏ పేపర్లోనూ?"

"అదే సంగతి. ఈనాడే అతను వుంటే మరి ఏమయ్యేవాడో! నారోజుల్లో అతన్ని తలుచుకుంటే ఈనాడు, ఈ నాయకులు ఎవరు అగగలిగేవారు అతని ముందు ? మన దేశపు కాంగ్రెసు చరిత్ర ఎంత ప్రజ్వరిల్లే అక్షరాలతో వ్రాయబడేదో అనిపిస్తుంది ; కాని ఆనాడు అతనేం గొప్ప కాలేదు."

"ఎందుకు?"

"అదే విచిత్రం. అతని ధనంతో రూపంతో—"

"వాక్ ప్రతిభతో, దీక్షా పరత్వంతో...."

"సూనృతంతో, స్వార్థరాహిత్యంతో. .."

"అదేననుకుంటా కారణం. అతను ప్రథమనాయకుడు కాలేక పోవడానికి కారణం, స్వార్థం కొంత లోతునైనా లేకపోతే రాణించలేడనుకుంటా మనిషి లోకంలో."

"ఏం ?"

"స్వార్థం కొంత స్వప్రకటనకి కారణం. ప్రకటన లేంది ఏదీ ప్రచారం కాదు."

"గాంధిగారూ ?"

గాంధిగారివిషయం అన్ని రూల్సుకీ అధిగమించిన విషయం."

"ఏమిటి మాణిక్యం ? చాలా సునిశిత విచక్షణతో మాట్లాడుతున్నావు ? ఎప్పుడూ క్లాసులో చివరివాడివికదా....?"

"మరి ఎవరిసావాసం చేశాను అన్నేళ్ళు ? నా సంగతిపోనీ. అతని తెలివికి ప్రెసిడెన్సీ ఫస్టు వొస్తాడనుకున్నామా శ్రీధర్ని ? చివరికి ఏం చేశాడు ? అంతే అతను అతను ఉద్యమానికి రహస్యంగా తనకి తనే తెలుసుకోడం తప్పన్నట్లుగా, ఎంత ధనం ఖర్చుచేశాడో, ఎంత మందికి సహాయం చేశాడో, అహోరాత్రాలు ఎవరికీ తెలీకండా ఎంత కష్టించాడో పరమేశ్వరుడికి ఒక్కడికే తెలియాలి. అతను చేస్తున్నది ఏమిటో, ఎట్లానో, ఎంతో ఎవరికీ తెలీకపోవడంవల్ల అతనికి ప్రాముఖ్యం రానే లేదు. కాని దాగవు సంగతులు. ఏమీ తెలీకండానే అతన్నిచూస్తే చాలు మా అందరికీ గొప్ప ఉత్సాహం, ధైర్యం, విశ్వాసం. అతనిమీద ప్రేమా వొచ్చేవి. కాని ఏమనిషి దేంతోనూ అంత ఐక్యమైపోకూడదనుకో. కాంగ్రెసుని తప్ప లోకాన్నే మరిచి పోయినాడు అతను."

"పైకి తెలిస్తే జైల్లో పెడతారనేమో ఆ రహస్యం ?" అన్నాడు కాంతారావు.

"నోరుముయ్యి. జైలువాళ్ళు బైటికి గెంటితేగాని బైటికి వొచ్చేవాడు కాదు."

"అక్కడే సుఖంగా వుండేదేమో!" అన్నాడు సయ్యద్ నవ్వుతో.

"దానికదీ. దీనికిదీ. అట్లానే మాట్లాడతారు మనుషులు."

"కాకపోతే, ఏమిటా జైళ్ళకిపోవడం? తాటాకు చప్పుళ్ళకి కుందేళ్ళు బెదురుతాయా?"

"నీకు అర్థంకాని సంగతులు ఎందుకు మాట్లాడతావు!" అన్నాడు మాణిక్యంశెట్టి.

"అర్థం కాకపోవడమేముంది దీంటో! నీకే కాదు మాకూవుందోయ్ తెలివి. లెఖ్కల్లో సున్నావొచ్చినవాడివి నువ్వూ మనిషిమల్లే మాట్లాడతావెందుకు?"

"వింటారా? నేను పోనా?"

"కాదయ్యా! కాంతారావు, వీళ్ళ ఆశలు కూశావా, ఇంగ్లీషువాడిని తరిమి, యీ కోమట్లూ, బ్రాహ్మలూ పూర్వంమల్లే రాజ్యంచెయ్యాలని చూస్తున్నారు. ఎప్పటికీ పడనీమనుకో." అన్నాడు సయ్యద్.

"ఏమిటీ వితండవాదం కాంతరావు?" అన్నాడు మాణిక్యం విసికి.

"అవునయ్యా! మన శ్రీధర్‌కూడా ఆ పిచ్చిలోనే పడ్డాడంటే చిత్రంగానేవుంది. ఓ వెర్రివాడు ఆదేశించడమూనూ, ఇంక ఆలోచన లేకుండా నీరందరూ చెయ్యడమూను, రహస్యంగా ఎన్ని దురుద్దేశాలు, ఎన్ని పదవులమీది ఆశలు లేకపోతే చేస్తారంటావు ఈ పనులు?"

"అదంతా పోనీండి. నేను మీతో వాదించతలుచుకోలేదు. శ్రీధర్ సంగతి తెలిసి నేనింత చెప్పినాకూడా మీకు అర్థంకాకపోతే నేను చెప్పేది మీకేం అర్థమౌతుందీ? మీ ఖర్మ" అని మాణిక్యం లేచాడు. సయ్యద్ అతన్ని నడుంచుట్టూ చేతులేసి కూచోపెట్టాడు. నవ్వుతో.

"నమ్ముతాం లా. శ్రీధర్ సంగతి సరేలే. మీ కాంగ్రెసువాళ్ళ బుద్ధులు నీకు తెలీనివంటావా ?"

"అందరికీ వుండేబుద్ధులే వాళ్ళకీ వున్నాయి." అన్నాడు మాణిక్యం. పీవిష్‌గా,

"అవునులే. కాని వాళ్ళమాటలూ, వాళ్ళ చూపులూ అట్లావుంటా యేం ? వాళ్ళే సూనృతపరులులాగూ, ఏ స్వార్థం, ఆశ లూలేకుండా దేశా నికి ఆత్మల్ని అర్పించేవాళ్ళలాగూ, మేమందరం, డబ్బుమీది చెడు ఆశతో, బానిస బుద్ధితో బతుకుతున్నట్టూ...." అన్నాడు కాంతారావు.

"ఇదివరకు బ్రాహ్మలు మడిబట్టలతో లోపలి కుళ్లను కప్పుకునే వారు ఈ ఖద్దరు యీనాటి మడిబట్ట. ఈ మాణిక్యం బట్టల్ని చూడు. నిజంచెప్పు మాణిక్యం నీ లక్షన్నరా ఎట్లా సంపాయించావు ? పూర్వం కోమట్లు ఓ పదివేలుపెట్టి గుళ్లో నగలుచేయించి పాపం తీరిందనుకునే వారు. ఈనాడు కాంగ్రెస్‌కి చందాలిస్తున్నారు."

మాణిక్యం మాట్లాడకండా లేచిపోతున్నాడు. కాంతారావూ సయ్యదూ అతన్ని వెనకాలనించి అమాంతం ఎత్తుకొచ్చి, చెట్టుకింద పడుకోపెట్టి, ఒకరు కాళ్ళమీదా, ఒకరు గుండెమీదా కూచున్నారు.

"ఇంక చెప్పు."

"లేవండి, చెపుతాను."

"లేస్తాం, మరి చెపుతావా ?"

"ఊఁ."

లేచారు,

"ఓరే సయ్యద్. నువ్వు ఇంకోమాట అన్నావంటే. మిగిలిన నీ సగం గడ్డం నా వేళ్ళతో పీకేస్తాను." అన్నాడు కాంతారావు.

"నువ్వు కురుపుల్ని ఆపరేషన్లు మాని, వేళ్ళతో పిండుతున్నా వుటగా—ఆడవాళ్ళకి." అన్నాడు మాణిక్యం.

"నీ గొంతుక పిండుతా నిప్పుడు. కానీ."

గంగరావిచెట్టు మీద రెండు చిలకలు గోలచేస్తున్నాయి. ఎర్రనైన పూలు గాలికి వాళ్ళ మధ్య రాలాయి. వీళ్ళగోలచూసి స్నానాలుచేసి వొస్తున్నవాళ్ళు నవ్వుకుంటో పోతున్నారు. ఓ నలుగురు దగ్గిరగా వొచ్చి నుంచున్నారు తడిబట్టలు బుజాన వేసుకుని.

"కానీ, నోరుమూసుకుని."

"నోరుమూసుకుని ఏంచేస్తున్నాదేమిటి? మాణిక్యా—?" అన్నాడు కొత్తగా వొచ్చి నుంచున్న ప్లీడరు గుమాస్తా సూరయ్య.

"మాట్లాడకు; కథ చెపుతున్నాడు."

"బావుందా?"

"ఆ."

"ఇప్పుడేమిటి పొద్దున్నే? రాత్రికి చెప్పకుందాం" అన్నాడు కాలవలో సూరయ్య వీపు తోముతానని కాలవలో తోశేశిన జడ్జి డేనియల్.

"కాదులే, మీరుపొండి" అన్నాడు కాంతారావు.

"మేమూ వుంటాం" అని వాళ్ళు కూలపడ్డారు.

మాణిక్యం ప్రారంభించాడు...."

"నేను చెప్పేకథ నమ్మరు. నేను కల్పించాననుకుంటారు."

"ఏమాత్రం అనుకోము. నీకంత తెలివిలేదని తెలుసు." అన్నాడు సూరయ్య.

"అదుగో అడ్డం చెప్పారా...."

"చెప్పం చెప్పం."

"శ్రీధర్‌ని మీరెరుగుదురు. కాలేజి వొదిలిం తరవాత నేనెరుగుదును. కానిఇప్పుడే మనిపిస్తోందంటే, అతన్ని సరిగా మీరూ ఎరగరు; నేనూ

ఎరగను. అతన్ని అతనూ ఎరగడు అని. ఆ చిలకలు దున్నపోతులైతే మన కళ్ళ ముందు, మన డేనియల్ గాడిదగానూ, సయ్యద్ జెర్రిగానూ మారితే, మనకెట్లా అనిపి..."

"మన మాణిక్యం..."

"నోరు ముయ్యి, కానీ మాణిక్యం."

"మనకెట్లా అనిపిస్తుంది? అట్లా అనిపించింది నాకు."

"శ్రీధర్ ఏంగా మారాడేం?"

"విను. అతన్ని బలవంతంచేసి మునిసిపల్ ఎలక్షన్లకి నుంచో పెట్టాం పోటీ లేకండా. తరవాత చైర్మన్‌కి నిలబెట్టాం. పోటీ లేదు. ఎందుకంటారా? మా వూరి సంగతి తెలుసుకాదూ! పదేళ్ళనించి వూరు డబ్బంతా సైడు కాలవల్లో వాననీళ్ళ మల్లే కౌన్సిలర్ల జేబుల్లోకి మాత్రమే వెళ్ళిందని! అదేమన్నా ఆగుతుందేమోనని."

"మరి నీ సంగతేమిటి? నీ జేబుల్లోకి కూడా రాదుగా?"

"శ్రీధర్ వీడూ కలిసివేసిన పన్నాగంరా! తెలీటంలా అదంతా వీళ్ళిద్దరి జేబుల్లోకే....?"

"శ్రీధర్ని ఒక్కమాట అంటే వొప్పుకోను."

"పోనీ నీ వొక్కడి జేబులోకేలే, కానీ."

"అదుగో...."

"నువ్వే చెప్పావుగా, అతను మృగంగా మారాడని!"

"వింటారా? వెళ్ళనా?"

"వింటాం"

"వింటాం"

"వింటాం"

(2)

"మధ్యాహ్నం ఛైర్మను ఎలెక్షను. ముందటిరోజునించీ మర్యాదకి అందరు కొత్త కౌన్సిలర్ల ఇళ్ళకీ వెళ్ళాం."

"నువ్వెందుకూ వాడివెంట?"

"ఫలహారాలు పెడతారు కదరా ఇంటికి వెడితే! అందుకూ."

"ఛా. వాడికి లేకనా ఏం?"

"హాస్టల్లో జ్ఞాపకం లేదురా? వీడు ఎవరి విస్తళ్ళలో టిఫెన్ మిగులుతుందోనని చూస్తో కూచునేవాడు."

"ఓసారి నేను చూడకండా నా బజ్జీలు రెండు...."

"వూరుకోండి. మాణిక్యానికి కోపం వొచ్చిందంటే చెప్పడు. అవునా సూరయ్యా?"

కింద పాకే గాజు పురుగుని పుల్లలతో జడ్జీ వీపువేప్ప మెడకింద చొక్కాలో వొదిలే ప్రయత్నంలో వున్నాడు సూరయ్య.

"ఆ ఉదయం అతన్ని మధురంగారి ఇంటికి తీసికెళ్ళాను" అన్నాడు మాణిక్యం.

"మధురం మొగదా? ఆడదా?"

"ఆడ ఆమెరా! కాకపోతే కథ ఏముంది?"

"ఎందుకు వెళ్ళారు ఆమె ఇంటికి?"

"ఇడ్లీ ఉప్మా కోసం. ఆ మాత్రం తెలీదూ?"

"పైగా ఆమె కులుకుతో వొడ్డిస్తో వుంటే...."

"ఒరే మాణిక్యం, చూడ్డానికి తడిసిన ఎలుగు ం లాగుంటావు గాని - చాలా షోకైన సరదాలురా నీవి!" అన్నాడు వీపు తడుముకుంటో జడ్జి.

"వొరే డేనియల్! ఆ మొహిద్దీను విడాకుల కేసుల బూబుని ఎక్కడ విచారించావురా నువ్వు?" అన్నాడు మాణిక్యం.

"నోరు ముయ్యి. పక్కలు విరగతంతా. మొహిద్దీన్ భార్య... అంటో లేచాడు సయ్యద్ కోపంగా.

"వారే! నువ్వున్నావని మరిచిపోయినాను. Excuse." ఎక్స్యూజ్ అన్నాడు మాణిక్యం.

"ఇంతకీ మధురం ఇంటికి ఎందుకు వెళ్ళారు? అందులో పరగడుపున?"

"అదే సమయం గావును!"

"నోళ్ళు ముయ్యండి. ఆమె లేడీ కౌన్సిలర్."

"నువ్వేనా ఆమెని నిలబెట్టి..." ఆపి నవ్వుతున్నాడు.

"డీసెన్సీ" అన్నాడు కాంతారావు.

నవ్వులు ఆగిపోయినాయి. ఆ సభలకి రోజుకోరు ప్రెసిడెంటు. అతని ఆజ్ఞ ఆ రోజుకి అనుల్లంఘనీయం. ఆ రోజు కాంతారావు ప్రెసిడెంటు.

"పోనీ ఆ కథానాయకిని ఇన్ట్రొడ్యూస్ చెయ్యి-"

"ముప్పై ఏళ్ళు. ఏం అంత అందం కాదు. ఇద్దరు పిల్లలు. మొగుడికి వేరుశనగ మిల్లు. భార్యకి ఖద్దరు చీరె కట్టి నిలబెట్టాడు. ఆ పేట అంతా ఒకటే కులం. నారపీచు. ఆమె ఇంటికి వెళ్ళాం ఆ ఉదయం" అని ఆగాడు.

"వెళ్ళారులే. తరవాత..."

"మాణిక్యం మొహం చూడు" అన్నాడు భూస్వామి గజపతివర్మ.

"చూడు. ఆ సంతోషం..."

"కాదురా! దిగులు, తలుచుకుని."

"కానీరా"

"తరవాత ఏం జరిగిందో జ్ఞాపకం తెచ్చుకుంటున్నాను. నేను చెప్ప బోయేది మీరు నమ్మాలి మరి. సరేనా ?"

"" "ఊ" "ఊ" "నమ్మతాం కానీ"

"లోపలికి వెళ్ళాం. మేము ఎట్లాగూ వొస్తామని తెలుసుగా, అందుకని ఉప్మా, కాఫీ మా ముందు పెట్టారు. ఆమె వొచ్చి కూచుంది కుర్చీలో. మొగవాళ్ళలోకి వొచ్చి కూచునే అలవాటు లేని మామూలు స్త్రీ మల్లేనే. నువ్వు తెలుసుకోవలిసిందేమిటంటే శ్రీధర్ ఎన్నడూ అదివరకు ఆమెని చూడలేదు. ఆమె అతన్ని చూడలేదు. మాలో కాబోయే ఛైర్మన్ ఎవరో ఆమెకి తెలీదు. ఆమెని మేము గట్టిగా గమనించలేదు. గమనించేందుకు ఏమీలేదు. ఏదో లింటో మాట్లాడుకుంటో వున్న మేము ఆగిపోయినాము. ఆగిపోయినాము అంటే....ఎట్లా ఆగాం; ఏం చెయ్యడం ఆగాం — అంటే... సరిగా చెప్పలేను. ఏదో ఆగిపోయింది మా మనస్సుల్లో. పెద్దవారు వొస్తే అల్లరిగా మాట్లాడుకునే చిన్నపిల్లలు ఆగుతారు చూడు, అట్లా. ఎందుకు ? అంటే వాతావరణంలో ఏదో తెలుస్తోంది, ఏమిటో మాకు అర్థం కానిదీ, కాని, ముఖ్యమైనదీ జరుగు తోందని, యోచిస్తే ఇప్పుడు, శ్రీధర్ మాట్లాడకపోవడం. అదీ కాదు అత నెప్పుడూ ఎక్కువ మాట్లాడడు. అప్పుడూ మాట్లాడుతోలేడు. కాని మాట్లాడని స్థితిలో వస్తావన్న మాట; కొంచెం సేపటికి అనుమానం తగిలింది గావును, అతని వంక చూశాను. అతను తినటం లేదు. ఉప్మాతో నిండిన చంచా అతని చేతిలో మధ్య అట్లానే నిలిచింది. తిరుగుతున్న ఫిల్ము మధ్యలో ఆగిపోయినట్టు. అతని దృష్టి మధుర మీద. దృష్టి ఆమె మీదనంటే ఆశ్చర్యంగా కాదు, అందం చూడ్డం కాదు. ఈమెని ఎరుగుదునే అని కాదు— ఏం కాదు. ఆమెలో లగ్నమైపోయి, ఇంకేం తెలీకండా. సూటిగా స్తంభించి పోయి— పరీక్షలో సగం అర్థంకాని ప్రశ్నమీద కళ్ళు నిలిపినట్లు— లోపలికి అర్థం వెతుకుతో ఏదో జ్ఞాపకం తెచ్చుకోవానికి ప్రయత్నిస్తో, ఆమె అంతే, అతనివంక అట్లానే సరిగా. పైగా మేం చూస్తో వుండగా ఆమె లేచి నుంచుంది. అతనివంక చూస్తోనే రెండడుగులు ముందుకు వేసింది. వాళ్ళిద్దరి మధ్యా నాలుగు గజాలదూరం వుంది. వాళ్ళ చూపుల వాపిడితో మధ్యస్థలమంతా పళపళమని

విధ్యుచ్ఛక్తి పగులుతున్నట్లుంది. ఒక్కొక్క ఉరుముకి ఆకాశం ముక్క లౌతోందా అనిపించదు? అట్లా!

నా మాటలు చాలా అల్పమనుకో జరిగినదాని ముందు. అదీ వాళ్ళిద్దరి మధ్యనే కాదు. మాకు తెలీకపోతే, ఏదో అనుకుందుము. దాని తీవ్రతలో ఎంత శక్తి అంటే, స్పష్టంగా కనబడే కాంతిమల్లే, లెంప పెట్టి కొట్టే గాలిమల్లే—అంత స్పష్టంగా బలంగా తెలిసింది. నా వొక్కడికే కాదు. అక్కడికి వొచ్చిన ఐదారుగురికీ. మన వెంకటప్పయ్యని తలుచుకో. అతను ఏపన్నా కల్పించి కవిత్వం మాట్లాడగలడా? అతనున్నాడు. అతన్ని మాట్లాడించి చూడు. అదొక అపూర్వానుభవ మనుకో.

ఆమె భర్త, ఇంకెవరో వాళ్ళు ఇద్దరు, మేం నలుగురం. ఏం అనాలో ఏం చెయ్యాలో తెలీక చూస్తున్నాం. ఆమె భర్త కామయ్య మొహం చూస్తున్నాను. అతనూ తెల్లబోయి భార్యవంక చూస్తున్నాడు. "కూచో" అన్నాడు భార్యని. ఆమెకి వినిపించలేదు. రెండడుగులు ముందుకు వేసింది. నా వేపు. శ్రీధర్ కుర్చీలోంచి లేవబోతున్నాడు. చప్పున నేను, "వెడతాం, మేం వొచ్చినపని తెలుసుకదూ! మధ్యాన్నం" అని శ్రీధర్ని బుజంచుట్టూ చెయ్యేసి బైటికి తీసుకుని వెళ్ళాను. అతని ధర్మమా అని నావెంట వొచ్చాడు. రావడమేమిట్లే! వొస్తున్నానని అతనికి తెలీదు. కాని అతని మొహం వెనక్కి తిప్పి ఆమె వంకనే చూస్తున్నాడు. ఆమె మావెంట వొస్తోనేవుంది. కారులో కూచోపెట్టాను శ్రీధర్ని. ఆమె వొచ్చి అతనిపక్కనే కారుని ఆనుకుని అతని చేతిపక్క తన చెయ్యివేసి నుంచుంది. చప్పున కారు స్టార్టు చేయించి శ్రీధర్ని ఇంటికి తీసుకొచ్చేశాను"

అని ఆగాడు మాణిక్యం.

డేనియల్ లేచి వీపు దులుపుకుంటున్నాడు. అంతసేపూ నిశ్శబ్దంగా విన్నారు. కథ పట్టుకన్న మాణిక్యం చెప్పే విధం వాళ్ళని కట్టేసింది. గాడిద ఒకటి అరుచుకుంటూ వొచ్చింది వాళ్ళవేపు. సీతాకోక చిలుకలు

రెండు చెట్టుమీద నించి దిగి వాళ్ళమధ్య పైకీ కిందికీ తరుముకుంటో తిరుగుతున్నాయి. చల్లని గాలి, ఆకాశం నీలాన్ని వాళ్ళ వొళ్ళకి రుచి చూపింది.

"ఏమిట్రా! మన మాణిక్యంలో వింత కవిత్వంరా పాపం!" అన్నాడు సయ్యద్. కాని వాళ్ళ మనసులన్నీ పనిచెయ్యడం మానాయి. మాటలు అసలు రాలేదు.

"కానీ, తరవాత."

అంటో వుండగా వొచ్చిన వోవర్సీరు నాగభూషణం—

"ఏమిట్రా! కోస్తున్నాడు మాణిక్యం? శ్రీధర్ కథేనా?"

"అవును."

"నమ్ముతున్నారా ఇంతమందీ బుద్ధిమంతులూ?"

"అబద్ధమంటావా?"

"కాక! నాదీ ఆ వూరేగా, అదంతా వీడి కవిత్వం. ఏంలేదూ, రోజూ జరిగే సంగతినే వీడిట్లా అల్లుతున్నాడు."

"అసలేం జరగలేదా?"

మాణిక్యం చాలా గాయపడి మాట్లాడ్డం మానేశాడు.

"ఏముందిరా! గొప్ప! మామూలూ రోజూ జరిగేదేరా! మన శ్రీధర్‌కి, మనకి కనపడని అందం దాంటో కనపడ్డది గావును, ఆ ముండని లేవతీసుకు పోయినాడు."

"లేవతీసుకుని పోయినాడా? ఏం మాణిక్యం"

"నన్ను మాట్టాడించారంటే తంతా."

"అడిగితే అంత కోపమెందుకురా!"

"మరి ఇంకేమిటి? నేనింతగా చెపితే నమ్మక, ఆ, గజం బద్దలగాడి మాటలు ఎక్కువై తే, నన్నడుగుతా రెందుకు?"

"మరి నమ్మేట్టు వుండవద్దురా. ఏది చెప్పినా?"

"అందుకునేగా, నమ్మడం కష్టమని మొదటే చెప్పాను!"

"నేను లేనులే నువ్వు చెప్పినప్పుడు. ఏడవకు."

"నేనెందుకు ఏడవడం? పొలాలకి నీళ్ళివ్వకుండా పేదరైతుల్ని ఏడిపించే నీ కంతకన్న ఏం అర్థమౌతాయి సంగతులు?"

"ఇంతకీ లేవతీసుకు పోయినాడా లేదా?"

"ఆ" అన్నాడు నాగభూషణం.

"నేనెన్నటికీ నమ్మను. శ్రీధర్ అట్లాంటి పని చేశాడంటే." అన్నాడు సూరయ్య.

"మరి ఏమైనాడు?"

"ఏమైనాడో! మనిషి కనపడకపోతే అంతేనా? 'ఆ మనిషి ఎటువంటివాడు? ఆ పని చేసేవాడా?' అని ఆలోచించ నఖ్కర్లేదా?"

"ఆడదాని విషయంలో ఏమీ ఆలోచించ నఖ్కర్లేదు."

"ఏం? నువ్వు ఎవర్నీ లేవతీసుకుని పోలేదేం?"

"నేనా? నేనెందుకు చేస్తాను అట్లాంటి పని?"

"ఏం? శ్రీధర్ నీకన్న ఏం తక్కువవాడు? అట్లాంటి పనులు చేసేవాడి మల్లే కనపడ్డాడా?" అని వాదించాడు మాణిక్యం.

"మరి తీసుకుపోయినాడా లేదా?"

"ఎవరన్నారు తీసుకు పోయినాడని?"

"నాగభూషణం అన్నాడా లేదా?"

"అంతే మరి. నాగభూషణం అంటే చాలు. ఎవరో వొకరు అంటే చాలు. అది నమ్మడానికి చాలా చొరవ. చొరవే కాదు ఇష్టం. అంతేకాని మనం అన్నేళ్ళ ఎరిగివున్న మిత్రుడు. అంత గొప్ప బుద్ధి కలవాడు, చేశాడా లేదా? చేస్తే ఏ పరిస్థితుల్లో చేశాడు? అనే ప్రశ్నన్నా రాదు." అన్నాడు కాంతారావు.

"మాణిక్యం! ఇంతకీ ఏమయింది? చెపుదూ?"

"ఏమో. నాకు తెలీదు."

"తెలీకేనా? ఇంత తగాదా చేశావు. శ్రీధర్ వకాల్తా పుచ్చుకుని?"

"తెలుసునన్న వాళ్ళకి తెలీదంటాను నేను."

"ఏం నాగభూషణం?"

"నేనూ విన్నదే. కాని సందేహం లేదు."

"ఎందువల్ల?"

అతను లేడు వూళ్ళో. ఆమా లేదు. అప్పణ్ణించి ఇప్పటివరకు వాళ్ళిద్దరి జాడా తెలీదు."

"ఏమంటావు డేనియల్? ఆ సాక్ష్యంమీద కేసు రుజువయిందంటావా నీ కోర్టులో?"

"వొప్పుకోను."

"పోనీ. వాళ్ళిద్దరో ఒకరో చచ్చారనుకోకూడదూ?"

"అదీ అనుకోవచ్చు. ఇద్దరూ చెరొకరూ వేరేవాళ్ళతో లేచిపోయినారనీ అనుకోవచ్చు. ఇందాక మాణిక్యం అన్నట్టు గుడ్లగూబలుగా మారి వుండవొచ్చు."

"ఏమైతే మనకేం? వొచ్చిందల్లా మన మాణిక్యానికి. మామూలు వ్యభిచార వ్యవహారాన్ని కవిత్వంలోకి మార్చి, 'విద్యుల్లతలు పరిగెత్తాయి, దేవతలు పుష్పవర్షాలు కురిపించారు' అంటున్నాడు."

"ఎందుకు అంటాడేం, ఏమీ లేంది?"

"శ్రీధర్ అంటే ఆయనికి చాలా గొప్ప. అందరిమల్లే ఏ పనీ చెయ్యడు శ్రీధర్ అతని దృష్టిలో. అతను ఏంచేసినాసరే, అది ప్రత్యేకం, కవిత్వం, గౌరవం, ఘనతా, అందుకని" అన్నాడు నాగభూషణం.

"వాళ్ళతోనేం? నువ్వు చెప్పు మాణిక్యం తరవాత ఏం జరిగిందో."

"ముందు ఆ నాగభూషణాన్ని అవతలికి గెంటండి."

"మాట్లాడనీంలే కానీ."

"కారులో ఎవ్వాళ్ళం ఒక్కమాటలేదు. శ్రీధర్ మాకు చోటివ్వలేదు. తక్కిన యిద్దరూ గుమ్మంలోంచే శలవు తీసుకు వెళ్ళారు. నేను మాత్రం అతనితో గదిలోపలికి వెళ్ళాను. సరాసరి ఈజీ కుర్చీలో పడుకొని, కిటికీ లోంచి పైటికి చూస్తున్నాడు. అంతే ఎక్కడా చూట్టంలేదు. నేను వెంట వొచ్చానని అతనికి తెలీదుకూడా నేమో :

"శ్రీధర్ ! ఏమిటి సంగతి ?"

ఎవరో కొత్తవారు అకస్మాత్తుగా పలకరించినట్టు, నావంక తిరిగి, "ఏమిటి ?" అన్నాడు.

"ఏమిటి మధురమ్మని చూసి అట్లా అయ్యావు ?"

"ఆమె ఎవరు ?"

"ఎవరేమిటి ?"

"నీకు తెలీదులే" అని విసుగ్గా అని తన ఆలోచనలోకి వెళ్ళి పోయినాడు. తరవాత ఎన్నిసార్లు పలకరించినా, అదే మాట, విసుగెత్తి వెళ్ళిపోయినాను.

మధ్యాన్నం అతన్ని ఛైర్మన్‌గా ఎన్నుకున్నాం.

మర్నాడు పొద్దున్నకి కొత్త ఛైర్మనుగార్ని పక్కలు విరగతన్నారని వూళ్ళో గోల. ఏదో మధురమ్మ సంగతే ననిపించింది నాకు. పరిగెత్తాను శ్రీధర్ ఇంటిదగ్గిరికి. కదలకండా కప్పుకుని పక్కమీద పడుకున్నాడు. వాకిట్లోనే తల్లీ పెళ్ళాం వొచ్చి ఏడ్చారు. పెద్దదెబ్బలు తగిలాయనికాదుగాని, అప్రతిష్ట వొచ్చిందని. సంగతేమిటని అడిగితే వాళ్ళకీ తెలీదు. నిన్నంతా ఒక్కమాట మాట్లాడలేదట. రాత్రి భోజనం చెయ్యలేదు. పదింటికిగావును చీకట్లో వెళ్లాడు. రాత్రి పన్నెండింటికి ఎవరో బండిమీద తీసుకొచ్చి గుమ్మంలో వొదిలి వెళ్ళారు. దెబ్బలు ఎక్కువలేవు. మాట్లాడడు. నేను

వెళ్ళి కూచున్నాను. తక్కినవాళ్ళందర్నీ వెళ్ళిపొమ్మని నన్ను తలుపు వెయ్యమన్నాడు.

"ఒక్కమాటువెళ్ళి ఆమె ఎట్లావుందో చూసిరా," అన్నాడు.

"ఆమె ఎవరు ?"

అతనికి కోపం వొచ్చింది.

"నీకు ఎవరో తెలీనట్టు..." అని, శాంతించి.

"వెళ్ళరావా? నీ ఋణం ఎన్నడూ తీర్చలేను."

నాకు అర్థమౌతోంది. నీతిమీద మర్యాదమీద ఉపన్యాసం ఆరంభించాను. 'ఇదేమిటి ? ఇన్నేళ్ళొచ్చి, ఇంత నిర్వ్యాజమైన ప్రజాసేవ చేసి, తీరా మేము ఛైర్మన్నుచేస్తే ...' అంటున్నాను. కాని వినటంలేదు.

"ఆదెవత్తె! అందమా ? తెలివా ? సంస్కారమా ? ఎవత్తైనో అంట్లపుండని—"

చివాలున లేచాడు. "నోరుముయ్యి. పో ముందు ఇక్కణ్ణించి."

పోవలసిందేమరి ! కాని కోమటివాణ్ణి. గాంధిగారి శిష్యుణ్ణి— అతనికి చాల మిత్రుణ్ణి.

"ఏమిటి శ్రీధర్ ! నీకేదో పిచ్చెత్తింది..."

చప్పున మళ్ళీ లేచి ఘాటుగా అన్నాడు—

"అంతేలే. ఎన్నడో యీ మామూలు బూజుమనక ప్రపంచంలో, ఏదో ఒకటి నిజమైనదీ, ఉజ్వలమయిందీ జరిగినప్పుడు, అది ఉత్త పిచ్చి. దానికి లక్ష ఆటంకాలు. మొగుడూ, కులం, నీతీ...ఛీ, ఛీ..."

"మన శ్రీధర్ చలం పుస్తకాలు చదువుతాడా ఏమిటి ?" అన్నాడు క్షాసేపుకింద వొచ్చిన ఇన్సూరెన్సు ఏజెంటు కుటుంబశాస్త్రి.

"చదివితేమాత్రం! నువ్వట్లా అయినావా ఏమిటి?" అన్నాడు నాగభూషణం.

"ఒరేయ్" యీ కుటుంబశాస్త్రి ఆడవాళ్ళని భీమా చేయించడానికి ముందు ఆ పుస్తకాలు చదవడానికి ఇస్తాడు తెలుసా?"

"ఐతే భీమాతో ఆగుతుందా?"

"కాని వీడిమొహంచూశా! మన్మధుడు స్వయంగావచ్చి స్త్రీ హృదయంలోకి తన పంచబాణాలూ ఒక్కసారి కొట్టినా లాభంలేదు వీడికి."

"ఏం?"

"వీడే..."

"డీశన్సీ" అన్నాడు కాంతారావు.

"నువ్వుకానీ మాణిక్యం. చాలా సరదాగా వుంది."

కాని మాణిక్యాన్ని అట్టే అడగక్కర్లేదు. చెప్పాలని కుతూహలం పొంగుతోంది అతనిలో.

"శ్రీధర్ అట్లా మాట్లాడ్డం చాలా విచిత్రం. లోకంతో ఏ తగాదా, ఫిర్యాదూలేని మనిషి ఎవరైనా అంటే శ్రీధర్. జైలుకి వెళ్లాడుగాని ఇంగ్లీషు ప్రభుత్వంతోకూడా తగాదాలేదు చివరికి అతనికి.

కళ్ళుమూసుకుని ఓ నిమిషం పడుకుని,

"నామీద ఏమన్నా ప్రేమవుంటే, ఒక్కసారి ఎట్లావుందో చూసి వొచ్చి నా ప్రాణాలు నిలబెడుదూ!" అన్నాడు.

"ఏం అపాయం వొచ్చింది ఆమెకి ఇప్పుడు?"

"వొచ్చింది గనకనే అడుగుతున్నాను."

"నీవల్ల నేనా?"

"సరేలే, వెళ్ళరా."

"వెళ్ళి ఏమని అడగను ?"

"ఏదో మిషమీదపోదూ ! నన్ను మాట్లాడించకు," అని కళ్ళు పెదిమలూ బిగింపుకుని పడుకున్నాడు" అని ఆగాడు మాణిక్యం.

చెట్టునీడ చిన్నదయింది. చలికాలపు మధ్యాన్నపు గాలి గడ్డిలోంచి సోమరిగా దూసుకుపోతోంది. భోజనానికి గంటకొట్టారు. వినేవాళ్ళల్లో కదలిక పుట్టింది.

"ఇంకా ఎంతవుంది ?"

"నాలుగుముక్కలు."

"కానీ..."

"భోజనం ?"

"అరగంట ఆలస్యంచెయ్యమని రూలింగు ఇస్తున్నాను. సూరయ్యా వెళ్ళి చెప్పు." ప్రెసిడెంటు ఆజ్ఞల్ని నెరవేర్చి తీరాలి.

"నేను వొచ్చిందాకా ఆగండి మరి."

"ముంచుకుపోదులే, పరిగెత్తు. కానీ మాణిక్యం, వొస్తాడులే వాడు."

"రానీండి."

"వెళ్లావా ఆ మధురం ఇంటికి ?"

"ఆ వెళ్ళా, గతిలేక."

"గతిలేక అంటావేం ? ఏడికీ సరదాగానే వుంది."

"అసలు శ్రీధర్ అట్లా ఎందుకైనాడంటావురా ?"

"చలం పుస్తకాలు."

"పిచ్చేనంటావా ?"

"నన్నడక్కండి. ఈనాటి వరకు నాకూ తెలీదు."

"కానీండి వొచ్చాను," అన్నాడు రోజుతో సూరయ్య.

"ముందు ఆమె భర్త కామయ్య కనపడ్డాడు. కోపంగా చిరాకుగా వున్నాడు. మాట్లాడలేదు.

"మధురమ్మగారు ఉన్నారా?" అన్నాను.

"ఏం సంగతి? ఎందుకు?" అన్నాడు దూకుడుగా.

"ఏమిటంటే మా కౌన్సిలు పార్టీలో...."

వినిపించుకోకుండానే అతను. "ఆయనగారు పంపించారా తమర్ని?" అన్నాడు.

"ఎందుకా కోపం?" అన్నాను, నెమ్మదిగా.

"కోమటివాడు తప్ప ఎవరన్నా అట్లామాట్లాడగలరా?" అన్నాడు కౌస్తుభం.

"ఆమాత్రం తెలివి నీకేదీ!"

"సైలెన్సు. ఎవరూ మాట్లాడవొద్దు కానీ మాణిక్యం."

"ముందు ఆ కౌస్తుభంగాణ్ణి తరిమెయ్యండి. లేకపోతే నేను చెప్పను."

"కౌస్తుభం! పోతావా? తన్ననా?"

"ఇంక నోరెత్తితే వొట్టు."

"కామయ్య ఉప్పున మారాడు. "ఏమిటండీ ఈ శోభ! ఎందుకట్లా ఐనారండీ శ్రీధర్‌గారూ? ఎటువంటి మనిషి! మణికదండీ ఆయన! ఏదన్నా పిచ్చా? భూతమా? నిన్నరాత్రి పడుకున్నాం. ఎవరో మెల్లిగా తలుపు కొట్టారు. తరవాత గట్టిగా కొట్టారు. తెరిచి చూద్దును కదా శ్రీధర్‌గారు. 'రండి దయచెయ్యండి' అనబోతున్నాను. నావంకే చూడకండా లోపలికి, వెతుక్కుంటో మా పడకగదిలోకి పోతున్నారు. ఆయన కంఠం ఆ తప్పుడు ముండ...." అనేసి చెప్పడం ఆపి తప్పించి మాట్లాడాడు.

"గదిలోకి సరాసరి వెళ్ళిపోతున్నారు. నేను వెళ్ళి ఇద్దరికీ మధ్య అడ్డం నుంచున్నాను. నన్ను తోసేసి, 'రా, మధురం' అని దాని చెయ్యి పట్టుకున్నాడు. ఆ ముండ కూడా...." అని ఆపి.

"తరవాత నా వొళ్ళు తెలీలేదు. మండిపడి కేకలు వేశాను. ఏమీ ఎరగనట్టు, 'ఇదేమిటి ఏం చేశానని, ఇట్లా కేకలు వేస్తాడు?' అన్నట్టు చూస్తున్నాడు ఆయన. ఇంతలో నలుగురూ వొచ్చి, ఆలోచించకండా కొట్టేశారండీ పాపం ఆయన్ని! ఆ గుమ్మందగ్గిర పడిపోయినాడు. నేను వాళ్ళని ఆపేలోపలే ఇదంతా జరిగింది. ఆయనమీదనించి దాన్ని లాగేసి.... కాదులెండి....ఆయన్ని బండిలో ఇంటికి పంపేశాను."

దిగ్భ్రిమచెంది కూచున్నాను. ఏమంటాం? ఒక్కమాట లేకండా లేచాను.

కామయ్య అడుగుతున్నాడు "ఆయన్ని చూశారా? ఏమిటీ గొడవ? ఏమన్నా చెప్పాడా?" అని నేను బైటికి వొచ్చేశాను. అప్పుడు జ్ఞాపకం వొచ్చింది నేను వెళ్ళినపని. తిరిగి గుమ్మంలోకి వెళ్ళి, "ఇంతకీ మధురమ్మ ఎట్లావుంది?" అన్నాను. నావంక తెల్లపోయి చూసి, "వుంది. ఎట్లాగో వుంది. అయినా మీకెందుకు నా సంగతి. పదండి" అన్నాడు కోపంగా. వెనక్కు తిరుగుతున్నాను. ఇంతలో చిరచిర వొచ్చింది మధురమ్మ "వొస్తున్నా, నేనూ వొస్తున్నా" అంటో. కామయ్య వొక్క తన్ను తన్నాడు ఆమెను. లోపలికి విరుచుకుపడి పోయింది స్పృహలేకండా. నన్నుచూసి 'మీరు పదండి' అన్నాడు. ఏం చెయ్యను? వెళ్ళిపోయినాను."

"కోమటాడు" అన్నాడు నాగభూషణం.

"అంతకన్న కాపుకుంకవి నువ్వేం చేస్తావో చెప్పు."

"సైలెన్సు" అన్నాడు కొంతారావు.

"తోవలో అనిపించింది. ఆమెనీ బాగా తన్నారని. తాళ్ళు తెంపుకుని వొచ్చిందేమోనని అనుమానమూ కలిగింది."

"తరవాత?"

"తరవాత నేనింక ఆమెని చూడలేదు."

"కబురన్నా తెలీలేదా?"

"లేదు. ఈనాటివరకు ఏమయిందో తెలీదు."

"చంపేశారు గావును."

"పారిపోయి వుంటుంది."

"ఆమె పిల్లలూ?"

"పిల్లలూ ఎదిగి పెద్దవాళ్ళవుతున్నారు."

"భర్తా ఏమీ చెప్పలేదా?"

"ఎన్నడూ ఎవరితోనూ భార్య సంగతి ఎత్తినట్టు కనపడడు."

"మళ్ళీ పెళ్ళి చేసుకోలేదా?"

"లేదు. కాని ఎవరో అతని బంధువురాలు, అందమైన ఆమె వొచ్చింది. ఆమె పిల్లలకి తల్లిగా వుంది. తక్కిందంతా కూడానేమో!"

"ఆమెని చంపి కృష్ణలో పారేసి వుంటారు."

"మరి మనవాడూ?...."

"వెళ్ళి చెప్పాను అతనితో ఏం జరిగిందో. ఒకమాట మాట్లాడ లేదు అతను ఎన్ని ప్రశ్న లడిగినానరే. వెళ్ళిపోయినాను. మర్నాటికి అతను లేడు. అంతే కథ. లేవండి భోజనాలకి." అన్నాడు మాణిక్యం.

"వుండు వుండు. ఇంకా గంటకొట్టలేదు. మూడునిమషాలుంది. అతని కుటుంబం ఏమయింది?"

"ఏమయింది? వుంది. ఆస్తినంతా వొదిలేశాడు కాదూ! పిల్లల్ని చదివించుకుంటో వుంది ఆమె. ఆమె అన్న ఎవరో వొచ్చారు కుటుం బంతో సహా. చాలా హాయిగా వున్నారు. ఓ పిల్లకి పెళ్ళికూడా చేసినట్టు న్నారు. కథ కంచికి వెళ్ళింది మనం ఇంటికొచ్చాం. అదుగో గంట. లేవండి ఇంక."

* * *

రాత్రి భోజనాలైనాక, వాళ్ళంతా గుంపులు గుంపులైనారు. ఒకచోట ఎంకిపాటలు, ఇంకోచోట అభినయంతోకూడా 'కోడి నాకోడి' అని భజన. ఇంకోచోట ఎలెక్ట్రిక్ దీపాలకింద పేట్లపేక. ఇంకోచోట సాయంత్రం ఆడిన చడుగుడు, బంతాట వివరాలు ఎవరన్నా చూడవలిసిన దృశ్యమే అది. 'కోడిపాట' పాడేది చాలా భయంకరుడైన యూనివర్శిటీ లెక్చరర్. ఎంకిపాటలకి వ్యాఖ్యానం చేసేది ఓ సంస్కృత పండితుడు. చడుగుడులో గెలిచింది వృత్తిపన్ను కమీషనరు పొట్టమీదఎక్కి గుక్కసడిలించిన లాకుల గుమాస్తా. ప్రభుత్వోద్యోగుల్ని తిడుతున్న మాణిక్యాన్ని కేకేశాడు వరండాలో కూచున్న కాంతారావు. కాంతారావు ఆనాటికి ప్రెసిడెంటు. ఎవరూ అతన్ని ఆనాటికి అనుమానించడానికీ, అవమానించడానికీ వీల్లేదు అందువల్ల. వల్లభాచార్ల పక్కచుట్టలో ముళ్ళకంపని పెట్టిందీ, వెంకటప్ప పూలుటోపీలో భాస్వరం ముక్కని పెట్టిందీ, రాజయ్య భద్రంగా తెచ్చుకున్న నున్నిపిండిలో భుజంగరావు బొగ్గుపళ్ళపొడిని కలిపిందీ ఎవరో తేలలేదు. కాలవనించి దబదబవొచ్చి తుడుచుకునేప్పటికి ఎట్లా వొచ్చాయో మాణిక్యం టర్కీషు తువ్వాలనిండా ఇరుక్కుపోయి చిన్న చిన్న పల్లేరుకాయలు. దానికే తిట్టిపోస్తున్నాడు తన మిత్రుల్ని.

"మాణిక్యం! శ్రీధర్ ఆచూకీ ఏమన్నా తెలిసిందా?"

"వుండు వొస్తాను" అని వెళ్ళిపోయినాడు. కొంచెంసేపట్లో, రామిరెడ్డిని తీసుకొచ్చాడు.

"ఇతన్నడుగు."

"నాకేం తెలీదు. నేనుకాదు. నేను దూరంగా కూచున్నా"అన్నాడు.

"అదేమిటి?"

"వాడులేడూ, ఆ బ్లాకుమార్కెటు సిమ్మెంటుగాడు నరసయ్య, భోజనందగ్గిర వాడిగ్లాసులో ఎవరో పేసుపౌడరు పోశార్ట. మీసాలన్నీ తెల్లగా ఐనాయి. అది నేనంటాడు.'

"అదికాదోయ్—శ్రీధర్ని చూశావుటగా నువ్వు! ఎక్కడ చూశావు?"

"అమలాపురం దగ్గిర."

"మాట్లాడావా?"

"ఆ; చాలా కథవుంది."

"అయితే చెప్పు."

"ఉండు మరి. ఇప్పుడుకాదు. రాత్రికి నన్నేదోచేస్తారుట. అదేదో కనుక్కోనీ."

"చేసేదేదో ఎట్లానూ చేస్తారు. కూచో, నీకు వాళ్ళు తెలీకుండా మందిస్తాలే"

"పైగా అదా?"

"అంతకన్న డాక్టరు మిత్రుడు నీకు చెయ్యగల దేముంది? ఎవరు రక్షించగలరు? ఆ బ్లాకుమార్కెటుగాడినించి, పోయిన ఏడు జ్ఞాపకంలేదూ....."

"వాణ్ణి ముందే తంతాను."

"వీల్లేదు. కూచో. ప్రెసిడెంటు ఆజ్ఞ."

"వాళ్ళని పిలు మాణిక్యం"

"శ్రీధర్ కథ! రండి" అని బిగ్గిరిగా కేకేశాడు మాణిక్యం.

మెల్లి మెల్లిగా ఒక్కొక్కరే వొస్తున్నారు పొద్దున్న విన్నవాళ్ళు.

"ఏమిట్రా మాణిక్యం అరుస్తున్నాడు?" అన్నాడు పేక ఆడుతున్న సింగు, సిగరెట్ పెట్టెకోసం వెతుక్కుంటో.

"ఏదో కథ చెప్పుకుంటారుగావునురా!"

"కథలా? పాతకథలా కొత్తవా?" అంటో పరధ్యానంగా సిగరెట్టు అందుకున్నాడు పెట్టెలోంచి.

(4)

"ఈ కొత్త కథలున్నాయే...." అంటో ఒక్క కేకేసి ఎగిరాడు.

ప్లేయర్స్ పెట్టెలో సిగరెట్లబదులు, కులకులలాడుతో రోకలిబండ పురుగులున్నాయి.

"ఎవడ్రా? ఎవడ్రా?" అంటాడు. ఏం లాభం?"

మళ్ళీ ఆటకి కూచున్న తరవాత— "ఎవరన్నా ఓ సిగరెట్ ఇవ్వండిరా."

అంటే నాగయ్య ఇచ్చాడుగాని, అది గోల్కొండ. విసిరి వాడి మొహానే కొట్టాడు.

"సిగ్గులేదురా! ఒరే! ఆ వంద ఎకరాలూ చచ్చేటప్పుడు కట్టుకు పోతారా? వెధవ సిగరెట్టూ నువ్వూనూ! వాటికన్న రోడ్డుమీద ఎంగిలి పీకెలు ఏరుకు కాలవరాదూ, నాబోటివాళ్ళు పారేసినవి?"

"వెధవదగుల్బాజీ పోలీస్ ఉద్యోగం చెయ్యకపోతే, నాలుగు ఎకరాలిస్తాను నాకు సాగుబడిచేసి బతుకు." అన్నాడు నాగయ్య.

పోయిన సత్యాగ్రహంలో నాగయ్య బొమికలు విరగతన్నించాడు లింగు.

"సరేలే. ఏమిట్రా ఆ మాణిక్యం అరిచాడు? పోగైనారు మహాను భావులు వినడానికి! ఒరే ఈ పత్రికల్లో కథలున్నాయే! ఒరే జోషువా! నువ్వెప్పుడన్నా ఈ పత్రికలు చదువుతావురా!"

ఏమన్నా ఫుట్బాల్ మాచెస్ వుంటాయా"

"కాదురా. వాటిల్లో కథలు."

"కథలా? కథలు నేనెందుకు చదువుతాను? అవి ఆడపిల్ల లకి. అసలు నేను చదువుతానని ఎందుకనుకున్నావు?"

"ఏదో ఇందాక భోజనం దగ్గిర కవిత్వం అప్పచెప్పావులే. అందుకని."

"అదా? ఒకడురా. మా ఇంటిపక్క దొడ్లో కుంకుడి చెట్టుకింద కూచుని అల్లాడురా ఆ పద్యాన్ని! కవిగాడుట! నా జరంలో అదేపనిగా పదిరోజులు విన్నాను. మా అత్తయ్య మూలుగులు వినకండా తప్పించు కోడానికి. రాత్రింబవళ్లు అదేపనిగా అరిచేవాడురా ఆ పద్యాన్ని."

"మీ అత్తయ్య ఎందుకు మూలిగేది?"

"పదిహేనేళ్ల కిందట మామయ్య బతికి వున్నప్పుడు ఆవిడ పాంజేవులో, వంకీలో, ఏ కోనగ బెహ్మాడుట. అందుకని."

"జోషువా! ఆ పద్యం నేనిందాక సరిగా వినలేదు. మళ్ళీ చదవరా!"

"నోరు ముయ్యి."

అన్ని వేపులనించీ వౌన్సుమోర్ అని కేకలు. ఎందుకో తెలీకండానే దూరాన్న జడ్జీగారికి వోణీవేసి నాట్యం చేయిస్తున్న గుంపుకూడా అందుకుని వౌన్సుమోరని అరిచింది. జడ్జి నాట్యానికి వెనక "అనుమానీ చూడియా" అని పాట పాడుతున్న రౌడీ అల్లం పాట ఆపి "వౌన్సుమోర్" అని అరిచాడు.

"పాడరామరి! ఇంక తప్పదు."

"సరసిరుహాక్షి నిన్నుగని సంతసమందగ
నోవలేదు, నే
నరయగ పారిజాత కుసుమాస్త్రిని బానిసగాన—"

అని చదువుతో వుండగా.

"ఖబింపుడీ, దుర్గ, ఖబింపుడీ.
ఖబింపుడీ, బూరి, ఖబింపుడీ,"

అని కొందరూ.

"మోయింపుము తాళాలా—

వాయింపుము మద్దెలలూ—
ఆడింపుము దవడలనూ—
కబళింపుము ఇడ్డెనలూ—"

అంటో ఇంకో జట్టూ, తాళాలతో, డబ్బాలతో వొచ్చారు. ఒక కుర్చీని పల్లకిలాగుకట్టి, దాంట్లో కావిలి ఏనాది అతని పటాన్ని దేవతలా అలంకరించి కూచోపెట్టారు. కాగడాలు రెండు, వెలుగుతున్నాయి. మామూలు గొడుగులు ఒకరు పట్టారు. సిరద్దారు జిల్లేడూ, తంగేడూ పూలదండలు వేసుకుని, గంధం రాసుకుని తాళాలు మోయిస్తో ముందు ఆడుతున్నాడు. పక్కన ఇద్దరు వకీళ్ళు. వాళ్ళు వెళ్ళిందాకా పేకా, పాటా ఆగిపోయింది అమ్మవారికి అగ్గి పుల్లల హారతు లందిచ్చారు కొందరు. కొందరు సాష్టాంగపడ్డారు. కొందరు భజనలోచేరి కొత్త పాటలు ప్రారంభించారు.

"ఇన్నాళ్లేడున్నావే నారాయణమ్మా
సిగరెట్టు కాలుస్తావా నారాయణమ్మా"

అని పాడుతో సయ్యద్ అమ్మవారి వెంటపడ్డాడు.

ఇంతలో ఎవరో "శ్రీధర్ కథ చెప్పుకుంటున్నారు" అంటే వరండా వేపు పోయినాడు.

చీట్లపేక దగ్గిర ఆడకుండా చూస్తున్న సుబ్బారావు అంటున్నాడు— అతను ట్యుటోరియల్ కాలేజీ ప్రిన్సిపాల్ -

"పత్రికల్లో కథలు పెదబల్లి వాడు చదువుతాడు అప్పుడప్పుడు, ప్రతి కథలో ఓ అబ్బాయి వుంటాట్ట ఓ గదిలో."

"గదిలో ఎందుకు వుంటాడు? ఏమన్నా జబ్బా!"

"కాదురా వుండు. ఎందుకో వుంటాట్ట. అతని చేతిపక్కనే గోడకి కిటికీ. దాంట్లోంచి చూస్తోవుంటాడు."

"ఏం చూస్తో వుంటాడు అంతకాలం?"

"వూరికనే చూస్తో వుంటాడు. ఆ ఇంటికి ఎదురుగా వున్న ఇంటికి ఈ కిటికీకి ఎదురుగా ఒకేఎత్తున ఓ కిటికీ ఉంటుంది."

"నేనెక్కడా చూడలేదే అట్లా వుండడం."

"వీళ్ళ కథల్లో వుంటుంది"

"అదేమన్నా కిటికీల కథా?"

"ఆ కిటికీ వెనక ఓ అమ్మాయి వుంటుంది. యవ్వనవతి."

"ఎందుకు వుంటుంది? పెళ్ళిచేసుకుని పోదా? ఇంటో పనులు వుండవా ?"

"ఏమో! ఆ రాసేవాడిని అడుగు. పైగా ఆ కిటికీలోకి తల దువ్వుకుంటూ చూస్తుంది."

"అంత రోడ్డూ, కుక్కలూ, గాడిదలూ, బస్సూ అన్నీ వుండగా ఎదురు కిటికీకేసి ఎందుకు చూస్తుందేం? ఈ ఎలిక కన్నంలో వున్న చీకటి గబ్బిలం కోసం?"

"తరవాత...."

"వాడిమీద ఓ సున్నంపెళ్ళ విసురుతుంది."

"ఆ కిటికీలకి కమ్ములు వుండవా?"

"విసరవలిసిందే. కళ్ళల్లో పడేట్టు...."

"కాదోయ్. ప్రేమసందేశం ఆ సున్నంపెళ్ళ."

అంటూండగా వాళ్ళమధ్య ఉన్న పేకాట బల్ల పైకి లేచింది. ఆపైన వున్న బట్టతో సహా నడవడం ప్రారంభించింది. తరవాత పెద్ద గోల.

ఇంతలో పొద్దుటివాళ్ళు వరండాలో చేరుకున్నారు. ముందు సయ్యద్ వొచ్చాడు; దేవి ఊరేగింపు నించి. అతనికి తులసిమాల వేశారు. పంగనామాలు పెట్టారు. ధోవతి కట్టాడు; విశాఖపట్టం సినీమా ప్రొప్రయి

టరుగారిని ఓ గాడిదమీద ఎక్కించి తోలుతున్న గుంపులలో వున్నాడు కౌస్తుభం. మాణిక్యం కేక వినడంతోనే ఆయన్ని గాడిదమీద నుంచి తోసేసి "నాకవసరమైన పని వొచ్చింది వాహనాన్నియ్యి" అని గాడిద మీద నెక్కి సరాసరి గాడిదతోనే వరండాలో సభకి వొచ్చేశాడు. సూరయ్యా, డేనియల్ భరతనాట్యం చేస్తున్నారు. తాము తిరువాన్కూర్ సోదరీమణులమని చప్పున మానేసి సభకి చేరుకున్నారు కాళ్ళగజ్జలతోనే. కుటుంబశాస్త్రిని నాటకంలో నడుంవరకు పాతేశారు. కనక వెంటనే రాలేక పోయినాడు. చదరంగంలో ఎదటివాడి రాజుని కట్టబోతున్న నాగభూషణం వొస్తున్నానని కేకవేశాడు.

"రామిరెడ్డీ! కానియ్యి. పొద్దున్నమల్లే ఎవరూ మధ్య మధ్య మాటలు పెట్టకూడదు." అన్నాడు డాక్టరు కాంతారావు.

"ఎప్పుడు చూశావు?"

"నాలుగేళ్ళయింది నేను అమలాపురం వెళ్ళాను...."

"అమలాపురంలో నీకేం పని. ఒంగోలు మనిషికి?" అన్నాడు మాణిక్యం.

"నీకెందుకురా!"

"అమలాపురం వెళ్ళాట్ట. ఎందుకు వెళ్ళాడు? నాకు తెలుసునేరా? చెప్పనా!"

ఏం చెప్తావో తెలుసు. అంతా అబద్దం."

"అబద్ధమైతే ఇంకేం? అక్కడండీ, జానకమ్మగారని ఒక సుందర వితంతూ లలామ వుంది. ఆమె...."

"నోరు ముయ్యి."

"మాణిక్యం వుండరా."

"ఏంలేదు. అక్కడ రిజిస్ట్రారు మన సూర్యప్రకాశం. సముద్రం దగ్గిరికి షికారుపోదాం రమ్మన్నాడు."

"ఏం? వొంగోలునించి సముద్రం చూడ్డానికి అమలాపురం వెళ్లాలా? వీడు చెప్పే మాటలు ఒక్కటీ నమ్మకండి "

"మాణిక్యం, నోరుముయ్యి. మధ్య మధ్య మాట్లాడితే పొద్దున్న గుంజుకుంటివే?"

"అదికాదురా. వీడసలు శ్రీధర్ని చూడనేలేదు. అన్నీ అబద్ధాలు. నమ్మడానికి వీల్లేదు."

"చెప్పనీ ముందు. నువ్వు పొద్దున్న చెప్పినవన్నీ నిజమైనట్టు."

"చూశారా? చూశారా? మరెందుకు చెప్పమని చంపారు?"

"వూరుకోరా. కానీరా రామిగా."

"వాళ్ళ పేర్లు మరిచిపోయినాను, బొండాడో ఏదో వూళ్లో ఓ రాజుల ఇంటో విందుకి వెళ్ళాం."

"చూశారా? వాళ్ళ పేర్లు కూడా మరిచాట్ట. నిజమైతేగా! అమలాపురం అని ఒక్క పేరు నాలుగో క్లాసులో జిల్లా భూగోళంలో చదివాడురా. అదీ జ్ఞాపకముంది. నిజమైతే ఆ రాజుల పేరు చెప్పు."

"నేనేం చెప్పను. వెళ్ళిపోతున్నాను, రండిరా."

"మాణిక్యం, అరగంట వరకు నీకు మౌనం ఆర్డర్ వేస్తున్నాను." అన్నాడు ప్రెసిడెంటు.

మాణిక్యం డేనియల్‌ని గోకాడు అడ్డు తగలమని.

"కాని రెడ్డీ"

"ఆ రాత్రి నిండు వెన్నెల."

"పత్రికల మల్లేనే వీడు తలుచుకున్నప్పుడల్లా చంద్రుడికి ఆర్డరిస్తాడురా వెన్నెల కాయమని" అన్నాడు డేనియల్.

"పడవలో సముద్రతీరానికి వెళ్ళాలని. మేం కట్టించుకున్న పడవ చాలా శుభ్రంగా అందంగా వుంది. నలుగురం ఎక్కాం. చుక్కానీ దగ్గర ఓ ఆడదీ కూచుంది.'

"అప్పుడే అనుకున్నా, రామిగాడు కథ ప్రారంభించాడా, ఆడది వొచ్చి తీరుతుంది."

"ఆడ నీ చుక్కాని ఈడనే గడ ఏసి"

"ఇందాక పాడుతోవుంటే విన్నాడు. దానిమీద కల్పించాడురా ఈ కథ!"

"రామిగా, నువ్వు ఆ టీచర్‌పని ఏడవకపోతే, పత్రికలకి కథలు రాసుకోరాదురా" అన్నాడు అప్పుడే వొచ్చిన నాగభూషణం.

"ఆడదీ చుక్కాని. మొగవాడు గడఏసి' అని వాడరాదురా? తీరిపోతుంది."

ప్రెసిడెంటు ఆడవాళ్ళ ప్రసక్తి తీసుకురాకూడదనే రూలుని జ్ఞాపకం చేశాడు.

"వాళ్ళు మామూలు పడవవాళ్ళలాగ లేరు. తెరచాప ఎత్తి ఆ మొగఅతను ఆమె దగ్గిర వెళ్ళి కూచున్నాడు. అతన్ని చూస్తే నాకేదో దూరం జ్ఞాపకాలు. ఆమెతప్ప అతనికి షేమెవరం లేము. ఎవరు వాళ్ళు అని అడిగాను. మమ్మల్ని తీసికెడుతున్న రాజు, ఎవరోనండి! బాగా చదువుకున్న వాళ్ళలాగు వుంటారు. ఓ ఏడాదయింది...."

ఇంతలో పెద్ద కోలాహలం.

"కోసలరావు వొచ్చాడు, కోసలరావు వొచ్చాడని...."

"కోసలరావా!" అని అందరూ పరుగెత్తడానికి లేస్తున్నారు- ఆ సభలో వాళ్ళంతా.

ఇంతలో కోసలరావే అటు వొచ్చాడు వెనక గుంపుతో.

"ఎక్కణ్ణించి వూడిపడ్డావు?"

"మీ ఇన్విటేషన్ నాకు ఎక్కడ చేరిందంటావు ? రామనాథ్ తగ్గిర పల్లెటూళ్ళో. అన్నీ వొదిలి పరుగెత్తుకుని వొచ్చాను. కానీండి. భోజనం చేసి వొస్తాను. ఏమిటీ సభ?"

"శ్రీధర్ కథ!"

"శ్రీధర్ కథా! శ్రీధర్ కథ మీకేం తెలుసు?"

"నీకు తెలుసా!"

"తెలీక!"

"శ్రీధర్ కథ కోసలరావుకి తెలుసుట."

"ఇంకేం ? ఈ రెడ్డిగాడి అబద్ధాల్ని కట్టిపెట్టించి, కోసలరావుని చెప్పమందాం!"

"కోసలుగాడు తక్కువ కోసేటట్టు!"

"ఏమిట్రా? నేనెప్పుడు అబద్దాలు చెప్పాను?"

"నీ జీవితమే అబద్ధం. ఎక్కడో రామనాధ్ దగ్గిర్నించి వొస్తున్నాట్ట బందరు బుట్టాయి పేట నుంచి వొచ్చి వుంటాడు."

"బందరే అయితే ఇంత ఆలిస్యం ఎందుకురా?"

"ఎందుకంటే నీ రహస్యాలు ఎత్తడం. రాత్రింబవళ్ళు టౌనుహాలు పక్కన మేడకిటికీ వేపు చూస్తో నీ తపస్సు ఎవరికి తెలీదు?"

"అంతేనన్న మాట నీకు తెలిసింది, ఇప్పుడు చెపుతున్నా విను. అది మన....జమీందారుగారి వ్యవహారం మీద!"

"మరి నువ్వు ఆ మేడ యజమానురాలుతో కుర్తాళంలో మూడు నెలలు ఏం చేస్తున్నావు ? ఆ దర్జీ వాణ్ణించి తప్పించింతరవాత! తెలీదనుకోకురా! నీ వొక్కడికే కాదు రహస్యాలు కనిపెట్టే ప్రజ్ఞ."

"అది వాడి ఫీజురా. ఇంక వూరుకో, కోసల్ ! నువ్వెక్కడ చూశావురా శ్రీధర్ని ?"

(5)

"అట్లా అడిగితే కాదు, కథ సరైన సెట్టింగులో చెప్పాలి."

"ఐతే భోజనం చేసిరా ముందు. ఈ లోపల రామిరెడ్డి చెపుతో వుంటాడు."

"ఇంక రామిరెడ్డి ఎందుకు?"

"అట్లాకాదు. కోసల్! ఎన్నాళ్ళయిందిరా, నువ్వు అతన్ని చూసి?"

"పోయిన ఏడే."

"ఓ! అయితే రామిరెడ్డిది ముందు కథ. అది విన్న తరవాత కోసల్ stop-press news స్టాప్ ప్రెస్ న్యూస్."

"ఈ తమాషా చూడండి ముందు. లైటు దగ్గిరికి రండి."

అంటో తన చేతి సంచీని తెరిచి, చప్పున నోరు వేళ్ళాడేశాడు, కోసలరావు. దాంటో రెండు చిరిగిన పాత గుడ్డలున్నాయి.

"ఇదేమిటి? ఎవరి సంచీ ఇది?"

"సంచీ మారిపోయిందా? ఎవరినడుగుతావు? రైల్లో ఎవడిదో సంచీ పట్టుకొచ్చినట్టున్నాడు వీడు." అన్నాడు అతని వెనక గుంపులో వున్న సాంబం.

"అప్పుడే మొదలు పెట్టావురా అల్లరి! ఎక్కడ దాచావు చెప్పరా సాంబం!"

"ఏమో వెతుక్కో, నన్నడుగుతావేం ? పోయిన ఏడు నాచేత చీకట్లో కట్టించావే చిరుగుపంచ అదే ఇది." అన్నాడు సాంబం కసిగా.

అట్లా పోట్లాడుకుంటో వెళ్ళిపోయినారు వాళ్ళు.

"కానీరా రెడ్డీ!"

"ఆ రాజు అన్నాడు. ఓ యేడాదీ కిందటనించి చూస్తున్నాను వీళ్ళని. దర్యాప్తు చేశాను. ఎవరో ఎవరికీ తెలీదు. చెప్పరు. వాళ్ళిద్దరూ ఒకరికొకరు. ఎవరితో సంబంధం లేదు. ఆ పడవకూలి వాళ్ళ జీవితం.

ఈ వూరికీ సముద్రానికీ మధ్య పడవ నడుపుకుంటో వుంటారు. తక్కిన పడవవాళ్ళకీ ఏమీ తెలీదు," అన్నారు. నా క్యూరియాసిటీ ఎక్కువయింది. ఏదో జ్ఞాపకం ఆ పడవ అతన్ని చూస్తే. మెల్లిగా వెళ్ళి వాళ్ళద్దరి సీటు దగ్గిరా కూచున్నాను. ఆమె చుక్కాని వెనక లోతుగాపడే కరిగించిన వెండి ధారలోకి చూస్తోంది. పది నిమిషాలైనా అంతే. ఏమిటా చూస్తోంది అని నేనూ చూశాను. చూస్తే గొప్పకవి వర్ణిస్తే మనకి మామూలు దాంటో అందం కనపడుతుంది చూడు. అట్లా ఆమె వెన్నెల నీటితో ఆడుకునే అందాలు, ఎన్నాళ్ళనించో తాను చూసిన రహస్యాలు నాకు చెపుతున్నట్టనిపించింది."

"ఓరి రెడ్డిగాడికికూడా కవిత్వంరోయ్!"

"ఏం రెడ్డి కవులు లేరురా?"

"వాళ్ళమొహం ! ఏ బ్రాహ్మలచేతో రాయించుకుని తమ పేర్లు పెట్టుకున్నారు డబ్బిచ్చి."

"ఏం గొప్పగా మాట్లాడుతున్నావే! ఒక్క బ్రాహ్మలకే కవిత్వం వొచ్చినట్టు!"

"ఎందుకురా తగాదా? డబ్బు తీసుకుని కవిత్వం అమ్ముకునే వాళ్ల ఆ బ్రాహ్మణ దౌర్భాగులుకాక ఇంకెవరురా."

మళ్ళీ ప్రెసిడెంటు జ్ఞాపకం చేశాడు కులాల తగాదాలు తీసుకురా కూడదన్న రూలుని.

"ఇట్లా నన్ను డిస్టర్బు చేస్తే నేను చెప్పలేను."

"లేదు. లేదు. నీ చిత్తం వొచ్చినట్టు కొయ్యి."

"పాటలు కూడా పాడు. ఎవరు వొద్దన్నారు? నీకేం? నీ మాటలు వినేందుకు గుమిగూడిన ఈ సభాసదుల తెలివిని మెచ్చుకోవాలిగాని!"

"సైలెన్సు. చెప్పరా రెడ్డిగాడా!"

"అతని దృష్టి ఆమెమీద. అంతటా వెన్నెల అంతులేకంఐ. ఎదురుగా కాలవ, దూరంనించి దగ్గిరికి వొస్తున్న సముద్రపు పిలుపు. వొడ్డున తోటలు, బయళ్ళు, చిన్నచిన్న కలవరాలు. తటాలున నీళ్ళల్లోంచి ఎగిరి దూకే చాపల మెరుపులు, అదో గొప్ప అనుభవమనుకో. ఆ రాత్రి వాళ్ళి ద్దర్ని చూస్తో నేనూ ఏదో మగతలో నిశ్చలంలో పడిపోయినాను. అంటే నన్ను నేను మరచిపోయినాను. మేలుకునే, అన్నీ చూస్తోనే, ఏమీ ఆలోచన లేకండా, ఇంకా అట్లా ఎప్పుడూ వెడుతున్నామనుకో, ఎక్కడికి? ఎంతసేపు? అనే ప్రశ్న లేకండా ఆ వెన్నెట్లో కలిసిపోయి."

"నిద్రపోయినాడురా వీడు?"

"చుక్కాని వెనక నీళ్ళుచేసే గలగల వాకచే స్మృతి. నా మిత్రులు ఏవో మాట్లాడు కుంటున్నారు గావును. నేనూ కొత్తేగా వాళ్ళకి. అందుకని నా (mood) మూడ్‌కి నన్ను వొదిలేశారు."

"నీళ్ళల్లోకి తోసేశారు కారు. మంచివాళ్ళు ఇంకా."

"చాలా మర్యాదస్తుడివి. వాళ్లతో వాళ్ల గెస్టుగా షికారు బైలుదేరి, వెళ్లి పడవవాళ్ల దగ్గిర కూచుని నిద్రపోయినాట్ట వీడు. నేనైతేనా ? వీణ్ణి అక్కడే పాతేద్దును."

"క్రమంగా సముద్రం హోరు వినిపించింది "

"వీడి గురకే అదీ, చుట్టలు కాల్చి కాల్చి."

"ఆ పడవ అతను లేచి తెరచాప స్తంభం దగ్గిరికి వెళ్లాడు. అతన్ని చూస్తే...."

ఇంతలో కుటుంబశాస్త్రి కాళ్లు దులుపుకుంటో వొచ్చిపడ్డాడు వాళ్ళ మధ్యకి.

"ఏమిట్రా కథ చెప్పేసుకుంటున్నారా?"

"ఎక్కడ చచ్చావు ఇంతసేపు?"

"నన్ను పాతేశార్రా! గట్టిగా పట్టుకుని...."

"ఆ లోకం కబుర్లేమిటి?"

"ఏ లోకం ?"

"అదేరా, చచ్చావుగా ?"

"నిన్ను చంపుతా ముందు."

"చావకపోతే, ఎందుకు పాతేశార్రా !" అన్నాడు సయ్యదు.

"అది మీసాయేబుల్ని. కాదురా, గొయ్యితీసి వుంచారు గావును. నాటకానికి స్టేజీకడదామని తీసుకుపోయి, నాటకంట, నేను ఆదేదో రుషినని, నన్ను నడుంవరకు పాతేసిపోయినారురా."

"వాళ్ళకి బుద్ధిలేదు. నడుంవరకేనా ?"

"నీ నడుం విరక్కొ_డతా. నోరుముయ్యి."

"చాల్లే కూచుని విను. తెల్లారి దాకా వుండకపోయినావా ? నీళ్ళు పోద్దును."

"ఎందుకు ?"

"చిగిర్చి పువ్వులు పూస్తావని."

"పీడిలోంచి పువ్వులా ! అవెట్లా వుంటాయో !"

"లంచాల పుష్పాలు."

"ఇకచాలు. కానీ రెడ్డీ. చాలా సరదాగా వుంది."

"ఏం చెపుతున్నాను ?"

"నిద్రపోయినావు. ఎవరు లేపారు నిన్ను ?"

"నోరు ముయ్యి...ఆ పడవ అతన్ని నేనెప్పుడో బాగా ఎరుగుదు ననిపించింది. మేం రూం మేట్సు కదరా రెండేళ్ళు !"

"తెలుసులే. పైగా చెప్పుకుంటా వెందుకు ?

"ఎవరు రూం మేట్సు ?"

"ఫీడూ, శ్రీధర్."

"రూం మేట్ లేకుండా వుండడుగా వీడు! శ్రీధర్ వైటకిపోగానే, ఆ పనిమనిషి రూం మేట్ వీడికి."

"అందంగా వుండేదికదా! కాని... ?"

"రూలింగ్" అన్నాడు ప్రెసిడెంటు.

"మాకు రెండు పక్కలా వెన్నెల ఇంకిన ఇసిక ఆకాశాల చివరి వరకు, ఎదురుగా మావంక గంతులేసి పిలుస్తో సముద్రం. ఓ దిబ్బమీద వింత అల్లికల నీడలతో సరుగుడు తోట. ఆ రాత్రి అక్కడ, మనవాళ్లూ, అంగళ్ళూ, దీపాలూ, రోడ్లూ మనసునించి కూడా చాలాదూరం! పడవ దిగి ఆ గాలిని పీలుస్తో ఏం చెయ్యటానికీ తోచక నుంచున్నాను. అతను, ఆ పడవ అతను, తెరచాప చుట్టి పడవని కట్టేస్తున్నాడు. ఆమె వొడ్డుకి దూకింది. ఆమెది వుత్త పల్లెవాళ్ళ ముతకచీరె, ఆ పమిటకింద జాకెటు వుందో లేదో! జుట్టు అసలు దువ్వి ఎన్ని నెలలైందో! అతను మోకాళ్ళ వరకు ఓ పంచా, చిన్న చొక్కా, జుట్టు పెరిగింది. కాని మూతి గొరిగే వుంది. మా వంక తలెత్తి చూడలేదు. నేను ఇంక ఆగలేకపోయినాను.

"నేను నిన్ను ఎరుగుదును కదూ!"

ఒక్క నిమషం నావంక తెలీనట్లు చూసి, లేదని తలవూపి, తిరిగే శాడు. ఆమె వొచ్చి, అతన్ని ఎవరన్నా ఎత్తుకుపోతారేమోనన్నట్లు అతనిచెయ్యి పట్టుకుంది. దూరంగా చూస్తో ఇద్దరూ, పక్కన నీడలే తోడుగా నడిచి వెళ్ళిపోయినారు. ఆ దిబ్బవేపు. నేనట్లానే చూస్తో నుంచు న్నాను. తరవాత సముద్రందగ్గిర తిరిగాం మేం నలుగురం. కాని నేను వాళ్ళల్లో లేను. మూడు మైళ్ళు నడిచి మాకు సిద్ధంచేసిన డాక్ బంగాళాలో నిద్రపోయినాము."

"అప్పుడేమో నీ పక్కలోకి ఓ గంధర్వకన్య వొచ్చింది. అవునా ?"

"ఆ సౌరిస్ కథలు చదివాడు గావును. వీడూ మొదలుపెట్టాడు."

"వీడు రాస్తే ఎవడూ చదవడు. అందుకుని మనం దొరికాం కదా అని ఇదే సమయ మని మనకి పట్టిస్తున్నాడు."

"అవును మరి. ఈ రెడ్డిగాణ్ణి ఓ పెద్దనిచేసి మధ్య కూచోపెట్టుకుని, 'కథ చెప్పరా' అంటే అంతకన్న ఏం చేస్తాడు ?"

"చెప్పు రెడ్డీ! వాళ్ళతో నేమిటి!"

"వాళ్ళని వెళ్ళకొట్టేస్తేనేగాని, నేను చెప్పను."

"ఎవరెవర్ని ?"

"ఆ నాగభూషణాన్నీ, సూరయ్యనీ, డేనియల్‌నీ."

"పొండిరా."

"మేమింక మాట్లాడం."

"మాట్లాడితే చెప్పను."

"ఏమో! చెప్పకపోతే కొంపలు మునిగినట్టు!"

"నువ్వేనూరా కౌస్తుభం ?"

"మరిచిపోయినాను. కానీ, నోరెత్తను."

"ఆ ఉదయం అడిగాను నా మిత్రుల్ని వాళ్ల రాత్రి ఎక్కడికి వెళ్ళి వుంటారని. ఆ చుట్టు పక్కల పల్లెవాళ్ళ గుడిశలు వున్నాయిట, అక్కడికి వెళ్ళివుంట రన్నారు. మావరండాలో నిలిచి కొబ్బరిచెట్ల కొమ్మలలోగుండా కనపడే సముద్రం నీలాన్ని చూదిలి. ఆ సరివితోట వేపు వెళ్ళాను. గాలి నించి దిబ్బని అడ్డంపెట్టుకుని అయిదారు గుడిశలున్నాయి ఓ చూరువు ముందు. వాకిళ్ళముందు చేపలు ఎండకి పరిచారు, ఓ గుడిశముందు కూచుని వున్నారు. రాత్రి పడవవాళ్ళు, విస్తర్లో రెండు ఎండు రొట్టెల్ని పెట్టుకుని పచ్చడి నంచుకుని నములుతో, నన్ను చూడలేదు. సగం చస్తున్న మొగలిపొద నీడలో నుంచుని చూశాను అతనివేపు. అప్పుడు గుర్తు వొచ్చింది అతను శ్రీధర్ అని."

"హారే. కల్పిస్తే కల్పించావుగాని, మళ్ళీ వాస్తవంలోకి తెస్తే ఎట్లా! సముద్రం. ఆకాశం అను. శ్రీధర్ సంగతి ఎందుకు?" అన్నాడు సయ్యద్.

"శ్రీధర్‌ట చాపల మధ్య గుడిశముందు కూచుని ఎందుకొ ఏడ్చి నములుతున్నాట్ట. ఏమంటావు మాణిక్యం?" అన్నాడు డేనియల్.

"ఏమోనబ్బా! శ్రీధర్ సంగతి ఏం చెప్పినా, నమ్మడానికి వీల్లేకండా అయింది నా పని."

"అప్పుడు శ్రీధర్‌తో మాట్లాడావా? శ్రీధరేనా?"

"వీడు దగ్గిరికి వెళ్ళకముందే వాళ్ళిద్దరూ సముద్రపు కొంగలుగా మారి ఎగిరిపోయినారు. ఔనా?"

"పోనీ వాణ్ణి చెప్పనీయరాదురా?"

"ఎందుకు? వాడికిమాత్రం ఆయాసంకదూ? ఎంతసేపని కల్పిస్తాడు ఆదేవరసగా?"

"రెడ్డీ ఎప్పుడన్నా, సినీమాలో కథచెప్పేవాడిపని చేశావా?"

"ఏం? కాంతారావ్. వీళ్ళని పొమ్మనరాదూ?"

"వాళ్ళతోనేంలే. చెప్పు."

"దగ్గిరికివెళ్ళి 'శ్రీధర్' అన్నాను.

'అదంతా మరిచిపో. వెళ్ళు. నేను పడవవాణ్ణి.'

నేను మాట్లాడుతోవుంటే ఆ స్త్రీ ఎవరో భయంగా చూస్తోంది. శ్రీధర్ని గుర్తుపట్టి నేను లాక్కుని పోతానేమోనని.

"సరేలే పడవవాడివే. నాతో మాట్లాడ్డానికేం?"

'చూడరా రెడ్డీ! (నిన్నరాత్రి నన్ను ఏమంది ఆపంచన కూచోకండి అన్నాడు శ్రీధర్) శ్రీధర్ చచ్చాడు. లేదు - నన్నెందుకు ఏడిపిస్తావు? పో. ఇంత ప్రపంచం వుండగా ఈగుసూల కెందుకొచ్చావు? పో నువ్వు

నీబోటివాళ్ళతో నాకు సంబంధంలేదు. నిన్ను నే నెరగను. పో" అన్నాడు దూకుడుగా.

"ఎట్లా పోనురా నిన్నుచూశాక? అందులో ఇట్లాంటి స్తితిలో!" అన్నాను.

నా బాధ అతనికి తట్టినట్టుంది. "నన్ను చూడలేదనుకో" అన్నాడు.

"పోనీలే, నాతో మాట్లాడితే నేంపోయింది?"

దూకుడుగా లేచాడు.

"ఏం పోయిందేమిటి? మొదట అట్లానే పలకరిస్తారు. తరవాత ప్రశ్నలు. శ్రీధర్ కనపడ్డాడని అందరితో చెప్పడం. నేను హాయిగా వున్నానర్రా అన్నా నన్ను చూసి దిగులుపడడం, నన్నెందుకు చంపుతారు బాబూ! పొండి" అని అక్కణ్ణించి సముద్రంవేపు నడిచిపోతున్నాడు. నేను వెంటపడ్డాను."

"చూడు శ్రీధర్! నే నట్లాంటివేం చెయ్యను. నిన్ను చూశానని ఎవరితోనూ చెప్పను.... నేను."

"మరి వాడితో అట్లాచెప్పి, వాడు కనపడ్డాడని, ఈ సంగుతులన్నీ మాతో చెపుతున్నావేం ఇప్పుడు?" అన్నాడు కౌస్తుభం.

"చెప్పనీరా! అవన్నీ నిజమైతేగా! వీడు శ్రీధర్ని చూడనూలేదు. ఏమాటా యివ్వనూలేదు" అన్నాడు సూరయ్య.

"పోనీ కల్పించడంలో కూడా నిజాయితీ లేకపోతే ఎట్లా! మాట ఇచ్చి తప్పానని చెప్పుకోడం ఓ గొప్పా ఏమిట్రా?"

"అసలు అమలాపురం ఎట్లా వెడతారో కనుక్కో వాణ్ణి. రైలు స్టేషన్ కదరా?" అన్నాడు కౌస్తుభం నవ్వుతో.

"నాకుపట్టిన దురదృష్టం ఏమని చెప్పుకోను? మాణిక్యం అడిగితే పొరపాటున మరచిపోయి 'శ్రీధర్ని చూశాను' అన్నాను. ఆ వివరాలు

చెప్పమని కూచున్నాడు. చెప్పకపోతే 'రాత్రి నిద్ర పోవాలని వుందా?' అని అడిగాడు. ఏం చెయ్యను నేను?"

ఈ లోపల భోజనంచేసి వొచ్చిన కోసలరావు—"చెప్పలే. ఫరవా లేదు. శ్రీధరిప్పుడు అమలాపురంలో లేదు" అన్నాడు.

"ఎక్కడ వున్నాడు?"

"నేను చెప్పను."

"చెప్పరా. కానీ."

"నేనేం మాణిక్యాన్నీ రామిరెడ్డినీ కాను. అంతా విన్నానులెండి. మీ అల్లరి నిన్నటింంచి."

"అసలు అమలాపురంలో వుండనేలేదు; నేను కల్పించా నంటున్నారు."

"కల్పిస్తే నేను కల్పించాలిగాని, వాడిమొహం రామిరెడ్డికేం చాత నౌను సరైన అబద్ధపు కథ అతికేట్టు చెప్పడం?" అన్నాడు కోసలరావు.

"అంటే—మేం బతిమాలగా, బతిమాలగా, నువ్వో ఓ అబద్ధం కథ కల్పించి మాకు చెపుతావన్నమాట."

"ఏం ఇప్పుడు నమ్మకం కలిగిందా? అందరూ కలిసి నా కాళ్ళమీద పడండి" అన్నాడు రామిరెడ్డి.

"కోసలరావు మాటలునమ్మా?" అన్నాడు నాగభూషణం.

"తరవాత?" అన్నాడు కాంతారావు.

"మాట్లాడకండా వెళ్ళిపోయినాడు. నేను బంగళాకివెళ్ళి శ్రీధరెవరో అదంతా వాళ్ళకిచెప్ప ...."

"చూశారా? చూశారా? ఇప్పటిదాకా ఎందుకు? అప్పుడే చెప్పేశాడు."

"చెప్పానన్నానా? చెపుదామనుకుని వూరుకున్నానన్నాను."

"చూశారా? మాటలు ఎట్లా మళ్ళిస్తాడో! కోర్టులో దొంగసాక్ష్యాలు చెప్పకు బతుకుతున్నాడు గావును వీడు రహస్యంగా!"

"తొరగా చెప్పరా! రాత్రంతా ఇక్కడే ఐపోతోంది. వాళ్ళందరూ హాయిగా...."

"నోరుముయ్యండి మరి చెపుతాను."

"మరి మరీ అంతనమ్మలేని పచ్చి అబద్ధాలు చెప్పకు" అన్నాడు కుటుంబశాస్త్రి.

"మర్నాడు సాయంత్రం ఆ పడవమీదే తిరుగు ప్రయాణమైనాము. భోజనాలు బంగళాలో చేసుకుని, ఈసారి బోటు తగిలింది. అందుకని తొరగాచేరాము ఆ వూరు. వాళ్ళన్నివెళ్ళమనిచెప్పి నేను బోటుదగ్గిరే వుండి పోయినాను. పక్కన బావిలో మంచినీళ్ళు తెచ్చుకొని వాళ్ళరొట్టెలు నవులుతున్నారు.

"చూశారా. అబద్ధాలు? పడవవాళ్ళట, బావిలోంచి నీళ్ళు తెచ్చుకున్నారుట."

"ఏడిశావులే నీతెలివికి, ఆ కాలవలో ఉప్పునీళ్ళురా. ఇంక నోరు ముయ్యి అతను నావంక చూడలేదు. ఆమెతో ఏదో మాట్లాడుతున్నాడు. పడవలో ఎక్కినప్పుడు నన్నెరగనట్టు. 'అటు వెళ్ళకండి. ఇట్లా కూచోండి' అన్నాడు. వాళ్ళిచ్చిన ఆరు రూపాయలూ కాక, వాళ్ళకి ఇంకా నాలుగు రూపాయలిప్పించాను. అందుకుగావును చాలా కులాసాగా వున్నాడు ఆ రాత్రి. నేను నిజంగా వాణ్ణి వొదిలి కదలలేకపోయినాను. హాయిగా వున్నానని వాడెంతచెప్పనీ, నాకు చాలా పెద్ద జాలివేస్తోంది. అందుకని కదలలేక అక్కడే కూచున్నాను. చివరికి ఏదో కరుణించిన మహర్షిమల్లే. "ఒరే నీ ఏడుపు ఏదో తొరగా ఏడ్చిపోరా" అన్నాడు. దగ్గిరికిపోయి కూచున్నాను. ఆమె మాకు వీపుతిప్పి కాళ్ళు పడవ పక్కనించి వేళ్ళాడేసి కూచుని నీళ్ళు అలలమీద తళతళలాడే వెన్నెలని చూస్తోంది.

"శ్రీధర్! నీ సంగతి విన్నాను. ఏదో వూరికే క్యూరియాసిటీతో అడుగుతున్నాననుకోకు. నీ మీద నాకెంత ప్రేమో నీకు కొంతైనా తెలుసుననే అనుకుంటాను. నువ్వు హాయిగా ఉంటున్నానంటావు. నాకు నిన్నుచూస్తే కడుపు తరుక్కుపోతోంది. పోనీ, ఇదేంహాయో, ఎల్లాంటి సుఖమో నాకు కొంచెం చెప్పి పంపించు. ఏదో ఊరట పొంది పోతాను" అన్నాను.

రెండునిమిషాలు యోచించి, 'రా' అన్నాడు. ఎవరో భారతంలో వ్యాసముని పిలిచినట్టు వెళ్ళాం. మా వెంట పిలవకండానే ఆమె లేచి వొచ్చింది. అతని గుడిశకి వెళ్లాం. అది గుడిశకాదు, పర్ణశాల. భేద మేమిటంటే చెప్పలేను. దాంటో వుండే మనుష...."

"పర్ణశాలని ఎన్నడన్నా చూశావా నువ్వు? ఎందుకురా కోతలు కోస్తావు!" అన్నాడు సూరయ్య.

"పర్ణశాల అనిపించింది."

"గుడిశెకీ పర్ణశాలకీ భేదమేమిటి?"

"ఏమిటో తెలీదు. దాంటోవుండే మనుష్నిబట్టి ఇంటిస్వరూపం ఎంత మారుతుంది. అట్లానే వెనక కొబ్బరితోట ఎవరిదో, ముందు ఆపెద్ద కాలవా, ఏవో రెండు మొక్కలు, కామినీ, రేరాణీ ఇట్లాంటివి.

"ఏం చెప్పమంటావు? ఆ పడవా, ఈ ఇల్లూ" అన్నాడు శ్రీధర్.

"తిండి?"

"తిండికేంలే, డబ్బునిపట్టి. తిండి ఒక గొప్ప సంగతా జీవితానికి?"

"ఒకటి చెప్పరా! వొచ్చేశావు. సరే వూరు వొదిలావు, కాని ఇంటి నించి కొంతడబ్బు తెచ్చుకుని, ఏదోబంగళాలో నౌకర్లతోవుండకూడదా?" అని అన్నాను.

"నేనేం కారణం చెప్పలేను. కాని మనతిండి మనం సంపాయించ డంలో ఏదో చురుకుతనం, ఉత్సాహం ఉంది. ఓ ఇంటో ఇద్దరు ఎదు

రెదురుగా కూచుని ఏంచెయ్యం? అదిగాక డబ్బు అనగానే మనుషులా, మర్యాదలా, ప్రశ్నలా, మేమెవరమోనని భోగట్టాలా. ఇది చాలా బావుంది.

"ఇప్పుడు మాత్రం కనుక్కోరా క్రమంగా...."

"అప్పుడు ఇంకోచోటుకి. సంపాయించుకోని డబ్బు బరువు భయం. సంపాయించుకొనే అలవాటుని మరచిపోతే రక్షణ లేనట్టుంటుంది. కాని ఇప్పుడు ఏం లక్ష్యంలేదు. ఎక్కడైతే నేమనే ధైర్యం."

"కాని ఏం బతుకంట ఇది? ఎవరికి ఉపయోగం?"

"నువ్వెవరికి ఉపయోగం?"

చచ్చాను. అవును నేనెవరికి ఉపయోగం?

"కాదురా. నువ్వుత్తవాడివా? కాంగ్రెసుకి సేవ, కుటుంబం, ఆస్తి, అంతా ఈ బతుకు కోసం...."

"కాదు. ఆమెకోసం. అంటే ఆమెకైన నాకోసం."

"ఏమండీ మధురమ్మగారూ! కోప్పడకండి. మీరైనా చెప్పక పోయినారా? ఇతన్ని ఇట్లా తీసుకువొచ్చి అతని కుటుంబానికేకాదు, దేశానికి ఎంత నష్టం తెచ్చారో, ఇతన్ని ఎటువంటి స్థితికి తెచ్చారో గమనించారా? మగవాడు సిద్ధమైనా అటువంటి త్యాగాన్ని స్త్రీ లంగీకరించ కూడదు."

"మీకు అర్థంగాని విషయాలు ఎందుకు మాట్లాడుతారు?" అంది కోపంగా.

"అర్థంకానంత మహిమ దీంటో ఏముంది?"

"ఇవి అర్థంకావు. చాలా చిక్కవి. క్లిష్టాలు అనుకున్నవి ఎన్నటి కన్నా అర్థమౌతాయిగాని, చాలా స్పష్టం మనకు అనుకునేవి ఎన్నటికీ అర్థంకావు" అంది. ఆ మాటకి గర్వంతో మెరిశాయి శ్రీధర్ కళ్ళు.

"పోనీ చెప్పండర్రా కొంచెం. నేనూ బి. ఏ. first class ఫస్టు క్లాస్‌లో pass పాస్ ఐనాను" అన్నాను దీనంగా.

ఇద్దరూ ఒకటే నవ్వారు.

ఒరే! ఆ నవ్వు విన్నతరవాత, ఆ నవ్వు తలుచుకుంటే అర్థ మయింది కొంచెం. అట్లా మనం ఎప్పుడూ నవ్వం. అట్లాంటి నవ్వు వినం. మనసులో, యీ కపటాలూ, చీదరలూ, పోటీలూ. అన్నీ దాటి పోయినవాళ్ళే నవ్వగలరు అట్టా. అందుకనే డబ్బుని వొదులుకున్నారు వాళ్ళు. అంటే మర్యాదనిచ్చే డబ్బుని; అంటే ప్రపంచాన్ని.

"సుఖమంటే, మనసుని ఏదీ కలతపెట్టని శాంతి." అన్నాడు శ్రీధర్.

"బీదవాళ్ళకి మాత్రం కష్టాలురావా?"

"వొస్తాయి, వొచ్చినప్పుడు నిలబడేందుకే దాంపత్యం, ఇంకొక రిలో ఐక్యం, ఏమీ పరస్పరం వాంఛించని ఐక్యం."

"కాని ఇదేం బతుకు? ప్రతిష్టా మర్యాదా, స్నేహితులూ, ఒకటి చేస్తున్నాం, సాధిస్తున్నాం అనే ఉత్సాహం లేకండా."

"గాలికి తెరచాపపట్టి నీళ్ళని చీల్చుకుంటో పో, తెలుస్తుంది." అన్నాడు శ్రీధర్.

"ఏమొస్తుంది చివరికి?"

"వొరేయ్. ఇంటికిపోయి ఆలోచించుకో, అట్లాంటి మామూలు ప్రశ్నలు లక్షవేసినా జవాబురాదు. ఏదో స్త్రీకోసం చేశాననుకుంటావు. లేరా స్త్రీలు? డబ్బులేదా? ఇంతపని ఎందుకు చెయ్యాలి నేను? ఈ బీద తనం ఎందుకు? పోనీ! నాకేమన్నా పిచ్చా? మనకి తెలీని సంగతి ఏముందో దీంటోనని ఆగి యోచించరుకద! మీకు సరిపడకపోవచ్చు. కాని నాకేదో విశేషం కనపడుతోంది అనుకోరేం?" అన్నాడు.

"విశేషం వుందనే అనుకుంటున్నాం?" అన్నాడు నాగభూషణం.

"ఎక్కడ?"

"ఆ స్థలంపేరు చెపితే ప్రెసిడెంటుగారు వూరుకోరు. అట్లారా చెపుతా."

"తెలిసిందిలే. దానికి అతనే జవాబు చెప్పాడుగా!"

"చెప్పడానికేంలే. ఎట్లా చెప్పకుంటాడులే?"

నేనన్నాను "కాదురా, అంతా పాతపడ్డది. నీ కుటుంబాన్నీ ఈమెనీకూడా...."

"రెడ్డీ. అదంతా దాటేశాను. గొడవపడలేను. ఏవో పాతధర్మాలూ అవీ తలుచుకుని జీవితాన్ని చీకాకుపరచుకో తలుచుకోలేదు."

"మరి ఏమిటి నీకు జీవితంలో కావలసింది?"

"శాంతీ, అందం."

"అవి ఈ పడవలోగాని దొరకవా?"

"మనసుకి స్తిమితం కావాలి. ఏదీ అనుభవించడానికి, శుభ్రమైన అద్దమల్లే కావాలి. మనసు ఏదైనా కాంతి ప్రతిఫలించాలంటే, ఈ మాటలు నీకు అర్థంకావు. రెండేళ్ళకిందట నాకు అర్థమయ్యేవికావు."

"నాకు నేర్పు."

"లాభంలేదు. నువ్వు పడవవాడివైనా లాభంలేదు. నీకు చుక్కాని పట్టే....నీ మనసుకి—చుక్కాని పట్టగల స్త్రీ కావాలి. అదీ స్త్రీ. తక్కిన పనులకి ఏ స్త్రీఐనా పనికివొస్తుంది. త్యాగం లేదు, బండలులేదు. ఒకరి కొకరం మనసుల్ని స్థిరం చేసుకునేందుకు, జీవితంలో ఇటూ అటూ చూడనక్కర్లేని తృప్తినిచ్చుకునేందుకు సాధనమైనాము" అన్నాడు.

"ఆ మాటలెట్లా వినపడ్డాయి రెడ్డీ నీకు? నిజమేననిపించిందా?" అని అడిగాడు కాంతారావు.

"అసలు అతన్ని అట్లా వెంబడించి మాట్లాడించినందుకు సిగ్గేసిం దనుకో! ఎందుకంటే, అతని స్తిమితంమీద, మనకి తెలీందీ, అందుకో లేనిదీ అనుభవిస్తున్నాడనే ఈర్ష్యతో అతన్ని వెంబడించా ననుకున్నాను."

"ఇంకేం? నువ్వూ ఓదాన్ని పట్టుకొనిపో ఆ కాలవలోకి." అన్నాడు నాగభూషణం. "సిగ్గులేకపోతే సరి! ఓ ముండని పట్టుకుని వాడు పారిపోయి దాక్కున్నాడు. వాణ్ణి పెద్దచేసి, అదేదో ఘనతలాగు, గాంధిగార్ని ప్రశ్నించినట్టు ప్రశ్నిస్తే అంతకన్న ఏమంటాడు? పడవ పీఠమెక్కి ఉపదేశం ప్రారంభిస్తాడు. వాడి తప్పేముంది?" అన్నాడు ఇంకా.

"మీరు చూసివుంటే తెలిసేది. మాటలతో ఇదీ అని చెప్పలేను. అది ఓ అనుభవం. వాళ్ళిద్దర్నీచూస్తే ఏదో గొప్ప విశేషాన్ని, స్థిరత్వాన్ని శాంతిని, హాయిని చూసి అనుభవించి నట్టుంటుంది."

"అంతేనా?—మహారుషిని, దేవతని, వెన్నెలని, సీతా రాముల్ని చూసినట్టే వుందనూ! నీ సొమ్మేంపోయింది?"

"వినరా, నాగభూషణం! వెక్కిరిద్దుగాని. యూహాదికోసారి మనం ఇక్కడ చేరామా? ఈ మూడురోజులూ ఏడాదిలోకల్లా ఆనందంగా గడిపిన దీనాలనిపిస్తాయి నాకు. మీకూ అంతే. కాని ఈరోజుల ఆనందం, ఇంత అల్లరీ, వాళ్ళిద్దరిమధ్యా ఏకాంతంలో, ఎందరిమధ్యవున్నా, వాళ్ళిద్దరిలో నిలిచే పరస్పర శాంతితో ఏమీ పోలవలేమనుకో."

"అవునురా! ఏరు అడ్డంలేకండా, సిగ్గూశరం లేకండా, అదేపనిగా మరిగారు గావును! ఇంకేం?"

"ఏం మరిగారు?"

"చెప్పమంటారా ప్రేసిడెంటుగారూ?"

"వొద్దులే. కాని అట్లాంటివాళ్ళనీ చూశాంగా. మరి మన రెడ్డిగాని మాణిక్యంగాని అట్లా మాట్లాడతారా?"

"నేను అడిగాను అతన్ని, 'మరి నీ కాంగ్రెసు ఉద్యమం ఏమైంది?' అని."

"నేను లేకపోతే ఆగిపోయిందా?" అన్నాడు.

"నేను లేకపోతే కాంగ్రెసు ఆగదు. ఏ శాంతి లేకపోతే నేను ఆగిపోతాను. రెడ్డీ, ఎట్లా చెప్పను నీకు? అదేదో ఓ పొర కళ్ళముందు నించి తొలిగిపోయినట్టు అనిపించిందనుకో నాకు?" అన్నాడు.

"స్వార్థం" అన్నాను.

"మీ బతుకులో!" అన్నాడు. "ఏం పనులురా అవి; ఏదో ఘన కార్యాలు చేస్తున్నట్టూ, దేశాల్ని ప్రజల్ని ఉద్ధరిస్తున్నట్టూ మనని మనం మోసపుచ్చుకుంటో, ఇప్పుడెంత స్పష్టం అనుకున్నావు నా మనసు! అంత సేపూ మనకి తెలీకండా లోపల కుళ్ళూ, మన గొప్పే కద! పైకి మనని మనమే నమ్మించుకోడం, సుఖంగా వున్నామనీ, Enjoy ఎంజాయ్ చేస్తున్నామనీ, ఏదో లోకాన్ని స్వార్థరహితంగా ఉద్ధరిస్తున్నామనీ, ఎంతకీ డబ్బూ, కీర్తీ, స్వార్థం, లాభం. యీ పదాల్నించి తప్పించుకుని చేసేపని ఒక్కటిలేదు. కాని ఒక్కరం వొప్పుకోము. ఎవరన్నా నిజం అంటే మండిపడతాము. ఏదో ఎప్పుడో జరుగుతుందని ఎదురుచూస్తోనే కద బతుకు ఇప్పుడు అనేదాన్ని మరుస్తో, ఆ నిమషానికి ఆ నిమషం హాయి అని వెనకా ముందూ మరిచి బతికావురా?"

"సరేలే. నువ్వు ఎంత గొప్పవాడివయ్యేవాడివో! నీ వల్ల ఎంత మందికి ఉపకారం జరిగేదో!"

"విను. నిజంగా ఉపకారం చెయ్యగలిగినవాళ్ళు ఎవరో ఇద్దరు ముగ్గురు ప్రపంచంలో, గాంధిగారి వంటివారు. తక్కినవాళ్ళం లేకపోవడం వల్ల ఏ లోటూలేదనుకో. ఇతరులకి ఉపకారం అంటావా? ఎటు తిప్పి చూసీ, చివరికి డబ్బు వుపకారమేగా? డబ్బేం ఇస్తుందిరా మనుషులకి! ఆ డబ్బూ తిండీ ఎంతో కొంత ఎట్లాగో వొస్తుంది. కాని అందం, శాంతి,

అందం చూడగల కన్ను, శాంతిని అనుభవించగల మనసు ఎక్కడ దొరుకుతాయి" అన్నాడు.

"అక్కడికి పోయి పడవలో కూచుని ఏదో వేదాంతం పుస్తకం గట్టిగా చదివాడురా మనవాడు" అన్నాడు కుటుంబశాస్త్రి.

"అవును. వేదాంతం చదివాడు. కాని పుస్తకంలోంచి కాదు." అన్నాడు కోసలరావు అకస్మాత్తుగా.

"నన్నడిగితే. ఆమె కళ్ళల్లో అంటాను" అన్నాడు రామిరెడ్డి.

"ఏం లేదురా. ఏదో జరిగింది, అది బైటికి రానీలేదు గాని, ఏం చేశాడో! అది బైటికి వొస్తుందని, పారిపోయి దాక్కున్నాడు. అది అతని అదృష్టం వల్ల బైటపడలేదు" అన్నాడు సూరయ్య.

"మరి తిరిగి రాడేం?"

"వొస్తే, బైటపడుతుందని భయం."

"అదికాదు. పోతో, పోతో దాన్ని తీసుకుపోయినాడుగా!"

"ఎందుకు తీసుకుపోయినాడు?"

"మరి రాత్రులు చలి కాదురా? కంబళి మరచిపోయినాడు గావును!"

"కాంగ్రెసు డబ్బు సరిగా లెఖ్ఖలు తేలిందా మీ వూళ్ళో!" అన్నాడు నాగభూషణం మాణిక్యంతో.

"ఎప్పుడో నిన్ను తంతారోయ్" అన్నాడు అతను.

"అంతేనా రెడ్డి?"

"అంతే—నాచేత ఎంకిపాటలు పాడించుకున్నారు."

"నువ్వేరా. కోసల్, నీ కథ చెప్పు."

"నాదా?"

గంట కొట్టారు. నాటకం ఆ రాత్రికి గయోపాఖ్యానం. లేచిపోయినారు సభవారు ఆనాటికి. కోసలరావు సయ్యద్ చెయ్యి పట్టుకుని "పీళ్ళం

దరూ ఏమన్నా అననీ, శ్రీధర్ ఏం చెప్పనీ, అసలు వేరే కారణం వుందనుకో." అన్నాడు.

"ఏం కారణం?"

"ఈ చెట్లకీ, నవ్వులకీ, ఆకాశం నీలానికీ, ఆ నదికీ వున్న కారణమే" అన్నాడు.

* * *

ఇంక సాయింత్రం ఎవరి వూళ్ళకి వాళ్ల ప్రయాణమౌతారు. ఏడాదీ దాకా మళ్ళీ లోకంలో గడుపుతారు. డబ్బు సంపాదనలో, కాపరాల చీదర్లలో, బాధ్యతల్లో, అధికారాల్లో, మర్యాదల్లో, నిన్న సాయింత్రం అర్ధకవి పాపారావు అంటున్నాడు. "మనందరం చచ్చింతరవాత — మననిట్లా ఓ చోట చేర్చి ఇట్లా ఆడుకోనిస్తే స్వర్గంలోనో, నరకంలోనో, ఎక్కడైనా సరే, అంతకన్న దేవుణ్ణి కోరుకోవలిసింది ఏమీలేదు."

"మరి మన సంసారాలో!" అన్నాడు నాగభూషణం.

"చచ్చింతరవాత సంసారాలేమిటి ఇంకా!"

"నరకంలో చేరిస్తే! అవేవో కాల్చడాలూ అవీ వుంటాయిగా!" అన్నాడు సూరయ్య.

"అవునులే. కాని ఇందరమూ చేరితే యముడికైనా నవ్వురాదూ?"

ఆ దిగులే ఆవరించింది అందరి మనసులమీదా. ఏడాదికి ఏడు జరిగిన కొద్దీ తగ్గిపోతున్నారు వాళ్ళు సంఖ్యలో, పటుత్వంలో.

"వాడా? వాడు పోయినాడు కదరా!" అంటారు.

"వాడికి చాలా జబ్బుగా వుందిరా! ఎట్లా వొస్తాడు?" అంటారు.

"ఇంక బతకడు, మళ్ళీ వాణ్ణి చూడం" అంటారు.

ఎవరో వొకరు, కుటుంబానికి డబ్బు మిగల్చకండా పోయినాడా, ఆ నిర్భాగ్యుడెవరో, వెంటనే చందాలు పడతాయి. వేలకివేలు ఆ కుటుంబం సహాయార్థం.

"పోరే—జీవితం కూడా అంతేరా. వయసు గడిచినకొద్దీ, మన స్నేహితులు, ఆత్మీయులు, కుటుంబంవాళ్లు ఒకరొక్కరే రాలిపోవడమే గాని, మళ్ళీ కొత్తవాళ్ళని సంపాయించలేము కదా! ఎవరో పరిచయమైనా, చిన్నతనంలో మల్లే అతకదు." అన్నాడు కౌస్తుభం.

"కౌస్తుభం! నీకెవరో అతికారుటగా?"

"ఆ అతకడం వేరురా. అట్టే లాభంలేదు."

"ఎక్కడ అతుకు పడ్డదో కనుక్కోరా."

కాని ఆ జోక్సుకి ఆసక్తి పోయింది వాళ్ళల్లో. Point of order పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఇచ్చే వోపిక కూడా లేదు. ఆ చివరిరోజు ప్రెసిడెంటు కుటుంబశాస్త్రికి.

క్రిష్ణకి స్నానానికి వెళ్ళినవాళ్ళు మబ్బుగా వుండడంచేత ఆ ఇసిక లోనే కూలబడి వున్నారు ఆ ఉదయాన.

"రాదేంరా ఆ కోసలుడు?"

"వాడిది మహా బెట్టు. రానీ చెపుదాం."

"అవునుగాని, శ్రీధర్ సంగతి రాత్రి విన్నది నిజమేనంటారా?"

"సందేహం లేదురా."

"అయితే అర్థం?" అన్నాడు డేనియల్.

"అందుకే అసాధారణం అన్నారుకాదూ" అన్నాడు కౌస్తుభం.

"పోరే కౌస్తుభం, ఆ కొత్తావిడతో నువ్వూ ఓ పడవ నడప రాదుట్రా?" అన్నాడు సయ్యద్.

"వెమికలు విరగతంతుంది. ఈయన సంపాదన ఆమె చేతులో పొయ్యాలి ముందు, దాంటోంచి తనకి తోచింది వాదులుతుంది కుటుంబ పోషణకి."

"ఏమిట్రా కౌస్తుభం. నిజమా?"

"కాకపోతే—వీణ్ణి చూడండిరా..."

కిందికి వెల్లకిత్తలావొంచి సభాసదులకి కౌస్తుభాన్ని చూపాడు చూపాడు సూరయ్య.

"వీడి పొట్టా, ఆ మీసాలూ....ఎవత్త కోరివొచ్చిందంటారు యీయననిచూసి."

"ముందు చూడలేదుట్రా ఈయన్ని! ఈయన మీసం వెంట్రుక ఒకటివూడి తూము కాలవలో కొట్టుకొనిపోతోందట. ఎందరో మెరిసే యీ సునుకొత్త శరత్‌చంద్రికారేఖ ఎక్కడిది ఇది? అని ఏరి, ఇదీ ఎవరిదా అని వెతుకుతోవొచ్చి ఈయన్ని కలుసుకుని ప్రేమించిందట."

"వారే, పోనీ, మనకి కౌస్తుభం అదృష్టంలేదుగాని, మనం మన భార్యలకే ఆ ప్రాపోజిషన్ పెడదామా ఏమిటి? ఓ పడవ నడుపుకుందామని!"

"ఎందుకు?"

"మాణిక్యంగాడు ఆ పడవ నడపడంలో మహాత్యం రొమాన్సు వుంటుందంటున్నాడుగా. అదేదో చూద్దాం."

"పెళ్ళాలతో వీల్లేదేమోరా!"

"ఏంరా మాణిక్యం? పోనీ పడవ పంపకపోతేనేం? ఆ తోట మక్తాకి పుచ్చుకుని దాంటో గొబ్బులు తవ్వు."

"అదెవడ్రా రామకృష్ణుడో, ఎవరో, వాడి కావ్యంలో మొక్కలకి గొబ్బులు తవ్వుతోవుంచేనేగాని ఆ స్త్రీలో అందం కనపడలేదుట్రా! ఎందుకంటావు?"

"ప్రెసిడెంటుగారి అనుమతైతే నేను మీ సందేహం తీరుస్తాను." అన్నాడు కవిబ్రహ్మయ్య.

"వొద్దులే. కాని ఒకకథ చదివాను - తెలుగుదే. ఎవరో వళ్ళమ్ముకునే మనిషిని ప్రేమించి తోటలోచేరి, ఆమెకి ఉయ్యాలకట్టి వూపుతాడురా. ఓ పెద్దమనిషి-ఆమె మాళదేమోకూడాను".

"మనం నిజంగా అట్లా తోటల్లోకో, కాలవలమీదికో పోతే, మన భార్యలెందరు మనవెంట వొస్తారంటారు?"

"సీతపేరు చెపితేసరి, వొస్తారు."

"పధ్నాలుగేళ్ళు అక్కర్లేదు. పధ్నాలుగురోజులు చాలురా."

"రావణులున్నారని ఆశపెడితే!"

"ఆర్డర్" అన్నాడు ప్రెసిడెంటు.

"పోనీ మనం అందరం కలిసి శ్రీధర్ దగ్గిరికి పోదామా? పోయి, రహస్యమేదో మనకి చెప్పమని సిన్‌సియర్‌గా అడుగుదాము."

"ఎప్పుడో వొస్తాడురా మళ్ళీ. అప్పుడు అడుగుదాంలే."

"వాడుసరే, ఏదో అనుకో. ఆ మధురమ్మ వెళ్ళిపోవడం చూడు ..."

"ఏంరా అంత వింత, వెళ్ళిపోయిందంటే? మొగుడూ, బంధువులూ, పిల్లలు, చీదరా, వొండిపెట్టడాలూ, తిట్లూ అన్నీ వొదిలిపోయినాయి. హాయిగా పడవలో తిరుగుదామని తీసుకుపోయే మొగాడు దొరికితే వెంటవెళ్ళని ఆడది చాలా బుద్ధిహీనురాలు."

"హాయిగా ఏమిటి? ఆ తిండి, ఆ గుడిశా...."

"మరి ఆ వైభవాలన్నీ వొదిలి సీత వెళ్ళిపోలేదా రాముడివెంట?"

"సీత వెళ్ళడమూనూ—"

"నీతిలో భేదం, మోటివ్‌లో కాదురా. ఒక గొప్ప ఇంపల్సుపని చెయ్యాలి. ధర్మమని అన్నాసరే, కామమని అన్నాసరే, సీతని అడివికి పంపిన ఇంపల్సే. ఇంకో రూపంలో రావణుడికి ఆమెని ఎత్తుకుపోయే బుద్ధి పుట్టించింది. అల్లాంటి ప్రోద్బలం నెటుతో వుంటే, ఎంత నాశనానికైనా వొప్పుకుంటారు."

"మరి మనవాళ్ళకి ఏం ప్రోద్బలం?"

"అదేదో రొమాన్సు అనుకున్నార్రా వాళ్ళు."

"అదే అనుకోలేదు వాళ్ళు...." అన్నాడు వెనకనించివొచ్చి కోసలరావు.

"ఆ ధ్యాసేలేదు. ఏదో అసాధారణమైనదో, ఒక ప్రత్యేకమైనదో, అవసరమైనదో చేస్తున్నట్టు తెలీనే తెలీదు వాళ్ళకి. మనం రొమాన్సు అనుభవిస్తున్నాము. ప్రేమించుకుంటున్నాం—అని అనుకున్నారా ఏ ప్రియులైనా, ఆ ధ్యాస మనసులోకి వొచ్చిందా, తెలుసుకున్నారా, వాళ్లు విడిపోవడం అట్టే దూరంకాదు—మొత్తానికి ఆ సుందరానుభవం అంతటితో ఆఖరు."

"మరి ఏమిటంటావు వాళ్ళమధ్య?"

"ఏమీలేదు. శూన్యం. వుంటే అది వాళ్ళకీ మనకి తెలీనిది. గాని ఓమూలనించి ఓమూలకి ఎండుటాకుల్ని విసిరి, తోసి, ఓ మూల పారేసి నట్లయినారు వాళ్ళు. గాలి తోసిందనికూడా తెలీని ఆకుల్ని అడిగి ఎంత లాభమో వాళ్ళనడిగీ అంతే లాభం!"

"ఆ గాలి ఏదో నీకు తెలుసా?"

"వాడికి తెలీకేం? గాలి వాణ్ణి అనేకమూలలికి నెట్టింది. కాని చల్లగా చీకట్లో ఇంకోమూలకి పాకి, తెల్లారి ఎందుకు నా పక్కలో వున్నావంటే, గాలినెట్టింది నేనేంచెయ్యనంటాడు వీడు."

"గాలి నన్నూ నా లాగునీ ఈ పురుగుల ముందుకి నెట్టింది. ఏం చెయ్యను? జరగండి."

అంటో కోసలరావు వాళ్ళముందుకి వొచ్చాడు. అతని వేషం చూసి నవ్వుతున్నారు అందరూ. తురకలాగూ, నరిపోని పొట్టిచొక్కా.

"ఏమిట్రోయ్ అది?"

"ఏం చేస్తాడు? వాడి బట్టలన్నీ ఎవరో కాజేశారు" అన్నాడు దేనియల్.

"రాత్రి కట్టుకున్న పంచనంతా నిద్రలో వొంటిమీదే కత్తిరించే శారు" అన్నాడు సూరయ్య.

"ఏం చెయ్యను ఇంక? ఈ సయ్యద్‌గాడే ఆ పని చేసివుంటాడని వాడిపెట్టెలో బట్టల్లో వీటిని తీసుకుని వేసుకుని తక్కినవాటిని మండుతున్న వంటపొయ్యిలో కుక్కివొచ్చాను."

"నావా? నావెవడు తియ్యమన్నాడు నిన్ను? చూశారా. చూశారా."

"పాపం ఎందుకుతీశావ్. కోసలరావ్? బూబమ్మ చిరుగులతో, బొత్తాములతో సహా లెఖ్కపెట్టి పద్దువేసి పంపుతుంది వీణ్ణి."

"సరేగాని. కథకానీండి ముందు. కానీరా. కోసలరావ్. సయ్యద్, నీ టోపీకూడ ఇయ్యివాడికి."

"ప్రారంభించకముందు నేనొక్కమాట చెప్పాలి. ఈ కోసలరావు చెప్పబొయ్యేవన్నీ వుత్తకోతలు. సర్వం అబద్ధం. ఎవరూ నమ్మకండి. రాత్రి పడుకుని పొద్దున్నకి ఓ మంచికథ అల్లాడు."

"నీకెట్లా తెలుసు?"

"వీడి పంచ కత్తిరిస్తూ వుండగా తనకి వినపడ్డదని కత్తిరించిన వాడు నాకు చెప్పాడు."

ప్రెసిడెంటు లేచి నుంచున్నాడు.

"సైలెన్సు. ఈవాళ మనకి వ్యవధిలేదు. భోజనాలకిపోవాలి. తరవాత బిజినెస్ మీటింగ్. కనక నిజంగాని అబద్ధంకాని....

"సందేహం కూడానా?"

"సైలెన్సు. అబద్ధమేకాని, మనం కోసలరావు చెప్పేది నిశ్శబ్దంగా వినాలి."

"కొంగలు అరుస్తున్నాయి మరి."

"కోసలరావ్. కానీ."

"శ్రీధర్‌ని నేను గంగాతీరాన పాంచజన్యపురంలో చూశాను."

నవ్వులు.

"ఏమిటి నవ్వుతారు?"

"భలే పేరు ఏరావే పూరికి?"

"గంగాతీరం నిజమే కదరా."

"సైలెన్సు."

"అది ఓ వైష్ణవ భక్తుల ఆశ్రమం. గౌరాంగమఠం. నదీ వొడ్డున పెద్ద తోట... తోట మధ్య..."

"గులాబి పువ్వులు."

"కాదు. క్రౌంచకిసలయ, కిశోర, కిన్నెరారావ, కిరణ్మయి, కింకిణీ—" అన్నాడు సయ్యద్.

"సైలెన్సు."

"రెల్లుపాకలు వేశారు. ఆశ్రమంలో వైష్ణవ గురువు. పొద్దస్తమానం సంకీర్తనలు..."

"వారే. బాగా కొట్టేశాడురా. శ్రీధర్ సంగతా శ్రీకాంత్ సంగతా మాట్లాడుతున్నావు?"

"పొద్దున్నే పుచ్చుకు వొచ్చావా?"

"సైలెన్సు."

"ఆ ఆశ్రమంలో ఓ గదిలో మన శ్రీధర్, మధురం కాపురం."

"చాలాదూరం తీసుకుపోయినావే మనవాళ్ళని!"

"ఎట్లా వెళ్ళారు అక్కడికి?"

"పడవలోరా. గోదావరి కాలవలోంచి. గంగలోకి ఎంత? ఓ అంగ."

"ఏవో పాతాళ మార్గాలుంటా యంటారురా కాశీకి దాంట్లోంచి."

"సైలెన్సు."

"నేను వుడుకోక్కను. నేను దుర్గాబాయిగారి అన్నని. వినండి. నేను చెప్పేది విన్నదాకా మిమ్మల్ని వొదల్ను. నేను మాణిక్యాన్ని కాను.

కౌస్తుభాన్ని కాదు. వజ్రాయుధాన్ని. మీ వెంటబడి మీ వూళ్ళకి వొచ్చి వినిపిస్తాను. ప్రస్తుతం ఇక్కణ్ణించి ఎవరన్నా కదిలారా ? తంతాను. ఆ ఆశ్రమంలో..."

"అసలు నువ్వెందుకు వెళ్ళావు అక్కడికి?"

"అదో కథ, క్లుప్తంగా వినండి. రిటైర్డు ఇంజనీరు శేషరాజు కొడుక్కి పెళ్ళి మర్నాడనగా మిత్రుల్ని పెళ్ళికి తీసుకొస్తానని, తన సహాధ్యాయి, మార్గరెట్ని తీసుకొని పారిపోయినాడు. వెళ్ళి కలకత్తాలో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఆ తండ్రి influence ఇంప్లూయంస్ వల్ల ఆ వుద్యోగం తీయించేశాడు. ఉద్యోగంలేని కొడుకు ఇంటికి వొస్తాడనే ఆశలో. తిండికి మాడి, ఆ ఇద్దరూ ఏదో మఠంలో చేరారట. తల్లి మంచం పట్టింది, వాళ్ళని వెతుకుతో వెళ్ళాను."

"దొరికారా?"—సూరయ్య.

"లేదు. కాని దొరక్కేం చేస్తారు ? పర్యవసానం వొచ్చే ఏడు చెపుతాను."

"మరి ఈ కథని ఓ రాత్రిలోనే కల్పించావుకదా!"

"ఈ రెండో కథని నిమషాలమీద ఇప్పుడే అశువుగా చెప్పావుకదా" అని సుబ్బారావు.

"తక్కింది చెప్పడానికి ఏడాది వ్యవధి ఎందుకు నీకు?" అని పాపారాయకవి.

"సైలెన్స్."

"ఇద్దరూ కాషాయాలు కట్టుకున్నారు. రుద్రాక్షలు, శ్రీధర్కి గడ్డం. మధురం...'

"మధురమ్మ..."

„అక్కడ పేరు మారిపోయింది."

"కమల లతకింద మారలేదుకద!"

"లేదు. చాలా విశ్రాంతి. అందం. ఆ ఆశ్రమ వాతావరణం. స్త్రీ పురుషులు ఓ వందపైగా వుంటారు. పొద్దున్నే గంగాస్నానం, పుష్పమాలలు, హారతులు, నైవేద్యాలు, గానం, భజన."

"చదివాం లేరా అవన్నీ" అని కాంతారావు.

"వారే పోనీ, 'కోసలరావు కోత'లని వారపత్రికలకి రాయరాదురా నువ్వు! మమ్మల్నిట్లా ఏడిపించకపోతే?" అని డేనియల్.

"అక్కడ ఆ గురువుగారి తరవాత మన శ్రీధర్, మధురం ముఖ్యులు ఆశ్రమంలో. వీళ్ళని చూస్తే అందరికీ చాలా భక్తి. వీళ్ళిద్దరూ వాళ్ళందరితో కలిసి ఏ పనులు చేస్తోవుండనీ, ఒకరికి రెండోవారి మీదే కళ్ళు. చిన్న చిరునవ్వు, 'నువ్వు వున్నావు' అన్నట్టు. రాత్రి పడుకునేప్పటి దాకా ఇద్దరూ కలుసుకోరు. ఆలయంలో మాత్రం ఇద్దరి కళ్ళూ కృష్ణ..."

"రాత్రులు ఒకగదిలోనేనా యీ భక్తులు?" అని సూరయ్య.

"ఆర్డర్."

"ఏమన్నానండీ తప్పు! దాంపత్య భజనకి."

"ఆశ్రమంలో మరి నూరు గదులున్నాయా?"

"నూరెందుకురా? నూరుమందికి యేభై చాలు."

"అందరూ భార్యాభర్తలా?"

"ఆ రాత్రికి."

"No more, Order, నో మోర్, ఆర్డర్,"

అంటోవుండగా పక్కనించి కృష్ణవొడ్డుకి ఓ గుంపు భజన చేసుకుంటో ఓ శవాన్ని మోసుకు పోతున్నారు. ఈతాకు చాపల్లో చుట్టి.

"కొంపతీసి కలరా వుందేమిట్రా ఈ వూళ్ళో!" అని సయ్యద్.

"మొదట నేను శ్రీధర్ని గుర్తుపట్టలేదు. అసలు శ్రీధర్ సంగతి నాకు బాగానూ తెలీదు. విన్నదీ కాస్తా జ్ఞాపకమూ లేదు. నేను ఆ కుర్రాడి

కోసం వెతుకుతున్నాను కదూ, అందుకని మొహాలు పరకాయించి చూస్తున్నాను."

"ఆడవాళ్ళని కూడానా?"

"తెలీక అడుగుతాను కోసలరావ్, ఎన్ని మతాలని వెతకదలచుకున్నావు అట్లా?"

"వైష్ణవులు ఎన్ని మతాల్లో వుంటే అన్నేనురా, ఎందుకు శైవులు దేరాడు మరి?

"వైష్ణవులు కావలసివొస్తే, గంగాతీరానికివెళ్ళనఖ్ఖర్లేదు. ఇక్కడా వున్నారు." అన్నాడు కోపంగా కోసలరావు.

ఈ లోపల పీనిగ భజన నదిని సమీపించింది.

"కట్టెలు లేవురా. ఎట్లా దహనం చేస్తారు?"

"పాతేస్తారేమో!"

"సైలెన్సు."

"ఎవరో అక్కడ శ్రీధర్ని చూపి, 'మీ తెలుగు అతనే' అన్నప్పుడు నిదానంగా చూసి గుర్తుపట్టాను మనవాణ్ణి."

"ఏంరా శ్రీధర్ నన్ను పలకరించావు కావేం? మరిచిపోయినావా?" అంటే గుడ్లు తేలేసి చప్పరించి వూరుకున్నాడు. మధురాన్ని చూసి 'ఈమె ఎవరు' అంటే. 'నా వైష్ణవి' అన్నాడు. అప్పుడు నాకీ కథంతా పూర్తిగా తెలీదుగా?"

కాని శ్రోతలు అతని వేపు చూట్టం లేదు. ఆ పీనిగని ఏం చేస్తారా అని చూస్తున్నారు, కృష్ణ నీలం నీళ్ళవేపు. వాళ్ళ వీపులవెనక వలయంగా కొండలు. ముందు కృష్ణ వాళ్ళ కింద తెల్లని ఇసిక. పైన చల్లని మబ్బుల్లోంచి వెలుతురు. చాలా ఆహ్లాదంగా వుంది ఉదయం. పక్కగా బ్రిడ్జిమీదనించి వెళ్ళే రైళ్ళు. క్రిష్ణ అవతలనించి బెజవాడ, మోటారు ఖూతలూ, జనం గోలా, కొంచెంగా వినపడుతున్నట్టే వుంది వాళ్ళకి.

ఇంతలో పీనిగ భజన కృష్ణలోదిగి మధ్యకి వెళ్ళింది. ఆ పీనిగని ఇద్దరు ఇటూ ఇద్దరు అటూ పట్టుకుని వూపుతున్నారు.

"ఒరే, నీళ్ళలో పారేస్తున్నారు. వీళ్ళ దుంపతెగా."

"అట్లానే కలరా తెప్పించేది."

"ఎన్నటికి బుద్ధి అనేది వొస్తుంది ఈ దేశానికి?"

హటాత్తుగా చాపలో పీనిగ తన్నుకుని చాప చించుకుని బైటపడి వూపేవాళ్ళల్లో ఇద్దర్ని గొంతులు పట్టుకుని నీళ్ళలోకి ముంచుతోంది. తక్కినవాళ్లు నవ్వుతో, సభవేపు పరిగెత్తుకుని వొస్తున్నారు.

వాళ్ళని తరుముతో వెనక పొడుగాటి నల్లని పీనిగ జోషువా.

గోల అంతా అణిగి అందరూ కూచున్న తరవాత కోసలరావు చెపుతున్నాడు.

"రెండురోజులైనా నన్ను గుర్తుపట్టడు. మాట్లాడడు శ్రీధర్. ఆంధ్ర అరవింద యోగి తయారౌతున్నాడేమో. బ్రిటిషు ప్రభుత్వంనించి ఈ మఠంలో ప్రచ్ఛన్నుడైనాడేమో మనవాడనిపించింది,"

ఆ సాయంత్రం గంగానదిలోకి వెళ్ళే మెట్లమీద కూచున్నారు సూర్యాస్తమయంవంకచూస్తో శ్రీధర్, మధురం. ఇంకా ఇద్దరు పడుచు వైష్ణవీలూ. నేనూవెళ్ళి కూచున్నాను. అవతల వొడ్డు అడివిలో నెమళ్లు తిరుగుతున్నాయి. గంగలో చేపలు ఎగిరి దూకుతున్నాయి నిర్భయంగా. గంధమూ పువ్వుల పరిమళాలు వెదజల్లే ఆ గుంపులో కూచుని గంగ నీటిమీది పవనాన్ని అనుభవించడమే ఒక అపూర్వానుభవమనిపించింది నాకు."

"నీకేం ఓ గది ప్రత్యేకంగా ఇవ్వలేదా ఏమిటి?"

"లేకపోతే, ఓ ముసలి వైష్ణవి గదిలోకి...."

"ఆర్డర్" అన్నాడు ప్రెసిడెంటు.

"నిన్నా మొన్నా వీడినోరు ముయ్యలేక చచ్చారు ప్రెసిడెంట్లు. నోరుతెరిస్తే బూతులు. ఈవాళ వీడు మహాప తిత్త ఐనాడు. వీణ్ణి ఎవడంట

ప్రెసిడెంటుచేసింది ? వొరే, నాగభూషణం సరిగా మాట్లాడనిస్తావా! నిన్ను క్రిష్ణలో పారెయ్యమా ?"

"వాళ్ళు గురువుగారి మహిమలు మాట్లాడుకుంటున్నారు బెంగాలీలో. వాడు, శ్రీధర్ నావంకనన్నా చూశాడు కాడు. నాకు వాడి వాలకం చూస్తే మండిపోతోంది."

"మీకెవరికన్నా ఇక్కడ తెలుగు వొచ్చునా ?" అన్నాను.

ఎవరూ మాట్లాడలేదు. మధురంమాత్రం, "ఎందుకండీ" అంది రహస్యం చెపుతున్నట్టు. తలవొంచుకునే, నావంకనన్నా చూడకండా. తెలుగు తెలీదుకదా తక్కినవాళ్లకి అని, "ఒరే శ్రీధర్, ఇదిగో విను. నువ్వు నాతో సరిగా మాట్లాడతావా నీ బతుకు ఇక్కడ అల్లరి చెయ్యనా ?" అన్నాను. అప్పటికి నోరు పెగిలింది వాడికి.

"అల్లరిచెయ్యడం నీకు అంత అవసరంగాతోస్తే చెయ్యి గోసాయీ, నిన్ను అభ్యంతర పరిచిందెవరు ?" అన్నాడు.

"ఇంతకీ నన్ను నువ్వు గుర్తుపట్టలేదంటావా ?" అని అడిగాను.

"ఎందుకదంతా, చాలా స్వల్పవిషయం" అని, ఇంక నేను లేనట్టే వాళ్ళతో మాట్లాడుతున్నాడు.

"ఒరే శ్రీధర్, సరిగా నాతో మాట్లాడతావా ? ఒకటి దవడమీద పీకనా, నీ గడ్డం అదిరి వూడి కిందపడేట్టు" అని బెదిరించాను.

"నా మీద ఎందుకంత ఆగ్రహం గోసాయీ!" అన్నాడు వసిష్టుడుమల్లే.

"ఇదిగో, నన్ను గోసాయీ, గీసాయీ అన్నావా సరిగా జరగదు. ఒక్క దవడకాయేగాదు, సరిగా మాట్లాడిందాకా తంతో తరుముతాను నిన్ను." అన్నాను గుప్పెట చూపించి.

"అంత నీ కవసరమైతే కానీ" అన్నాడు దత్తాత్రేయ మహాముని లాగు.

"ఇక్కడకాదు. ఆ ముండల్ని వొదిలి, లేచి ఇట్లారా." అన్నాను. లేచాడు చాలా ఇబ్బందిగా. 'అపరాధం అపరాధం' అనుకుంటో.

పక్కనవున్న సంపెంగ తోటలోకి తీసుకువెళ్లాను. ఆ సాయం కాంతిలో గంగానది వొడ్డున ఆ తోట ఎంత అందంగా వుందని ! చెట్ల గుబుర్లు గడ్డిమీద పరచిన నీడల్లో, ప్రవహించే చిన్న కాలవ నీళ్ళల్లో స్నానాలుచేసి గంతులేసే పిట్టల అల్లరులతో.

అతన్ని ఓ తిన్నెమీద కూచోపెట్టి పాతకబుర్లు చెప్పి అరగంటకి మనిషిని చేశాను. ఆ భక్తిమత్తుని వొదిలించి, మన సమావేశాల సంగతి మాట్లాడి, మీ అందరి సంగతీ వాడిచేతనే అడిగించాను. మనుష్యుల్లోకి వొచ్చాడు చివరికి. అవీ ఇవీ చెప్పి వాణ్ణి నవ్వించి. "ఏంరా ? ఈ రెండు రోజులూ నీ మొహంమీది గడ్డివాముకింద దాక్కుని, నన్నెరగనట్టు నటించావేం ?" అని అడిగాను. దానికి పాపం, వాడు సిన్సియర్‌గానే మాట్లాడాడు.

"ఒక నిష్టలో, ఒక యత్నంలో వున్నప్పుడు, ఏ మాత్రం డిస్టర్బెన్సు అయిష్టమవుతుంది." అన్నాడు.

"ఏమిటా ప్రయత్నం ? ఈ భజనలేనా ?" అని అడిగాను.

"చూడు, కోసల్. ఏదన్నానరే ప్రపంచంలో అర్థం కావాలంటే. సానుభూతితో దానిలో ఐక్యమై, ఆ దృష్టితో యోచించాలి. ఎక్కిరింపూ, ఏంలేదని కొట్టెయ్యడం, చాలా సులభం. ఎక్కిరించుకో, కాని నన్ను cross examine క్రాస్ ఎక్జామిన్‌చేసి ఏం లాభం నీకు ?" అన్నాడు.

"అదికాదురా, నువ్వు బుద్ధిమంతుడివని నాకు తెలుసు. నువ్వు దీంటో పడ్డావంటే, ఇంకేదో వ్యవహారానికి వీలుగా. ఇక్కడ ఈ నాటకం ఆడుతో వుండాలి. కాకపోతే నిన్నెవరన్నా మోసపుచ్చి వుండాలి. నీమీద ప్రేమవల్ల అడుగుతున్నాను." అన్నాను.

"మరి ఆ రెండు నిశ్చయాల్లోంచి కదలకుమరి" అన్నాడు.

"ఏవి ?"

"నేను వివేకవంతుణ్ణనీ, పీకు ప్రేమాస్పదుణ్ణనీ." అన్నాడు.

"ఏంచెయ్యను ? కాకపోతే, ఈ విష్ణుభక్తి, భజనలూ, తులసి తావతాళాలూ, చాలా మహత్తరమైన పని నువ్వు అంగీకరించావనే అనుకోనా ? అసలు ఓ విష్ణో, కృష్ణో వున్నాడు. నిన్ను తరింపచేస్తాడు. దానికి భజనలు తప్పని సాధన. అది ఈ ఆశ్రమంలో ఆ గురువుగారి సమక్షంలో చేస్తేనే ఆ దయ కలుగుతుందని నమ్మమంటావా ? నువ్వు నమ్ముతున్నావని నమ్మమంటావా ?"

"ఆశ్రమాన్ని చూస్తే, మమ్మల్ని చూస్తే నీకేమనిపిస్తోంది ?"

"వొళ్ళు మండుతోంది" అన్నాను.

"ఎందుకు ?" అని అడిగాడు.

"సలక్షణమైన మనుషులు కాపరాలూ, ఉద్యోగాలూ, ఉద్యమాలూ వొదిలి ఇక్కడ హాయిగా తిని కూచుని భజనలు కొడుతున్నారని" అన్నాను.

"నీకేం ? నాయనా అదంతా వుత్త ఈర్ష్య. బాధ్యతలు లేకండా, ఓ భక్తిలో శాంతంగా వున్నామని" అన్నాడు.

"మూర్ఖుల డబ్బు హాయిగా వాడుకుంటో.ఇదీ చాలా గొప్ప మోసం" అన్నాను.

"విష్ణు లేడనుకో. దేవుడే లేడనుకో. భక్తిమాత్రం వాస్తవం. మా హృదయాల్లో వాస్తవం. ఈ ఆశ్రమాన్ని పోషించే ధర్మకర్తల మనసుల్లో వాస్తవం. జీవితంలో misfits మిస్ఫిట్స్ ఐ శాంతిలేక కొట్టుకునే కొందరు దౌర్భాగ్యులు ఒక శాంతిలో భక్తిలో బతుకుతున్నారు. హాయిగా తింటున్నారో, అని నీకాగోల ఎందుకు" అని అదిలించాడు నన్ను.

"మీ నీతి ? వాళ్ళందరూ భార్యాభర్తలా ! నీ మధురం...."

"వొరే, కోసల్, మమ్మల్నిచూస్తే నీకింత నీతిగొడవ పుట్టుకొచ్చిందేంరా" అన్నాడు బిట్టర్‌గా.

"కాదు, ఇదంతా ఏదో భక్తి అనీ, ఆశ్రమమనీ....వుత్త మోసం" అన్నాను.

"మీ కుటుంబాలూ, పతివ్రతలూ, ప్రేమలూ, ఎంత మోసం? ప్రపంచంలో భక్తులూ, యత్నాలూ, నియమాలూ, మర్యాదస్తులూ, అంతా ఎంత మోసం?" అన్నాడు.

"ఇదీ అంతేనంటావా?" అన్నాను.

"అనుకో, కానీ చాలా అందమైన సుఖమైన శుభ్రమైన మోసం. ఇన్ని మోసాలూ, అబద్ధాలూ, తంటాలూ పడి అక్కడ ఏమీ సౌఖ్యం ఎరుగరు మీరు." అన్నాడు.

"మరి ఇహ మీ గొప్ప ఏముంది? అని అడిగాను.

"ఏంలేదు. ఈ విధంగా శాంతిని సాధించాం."

"మరి ఆ కళ్ళు మూతలు, ఆ మడులు, ఆ ధ్యానాలు-ఏదో మహా మేమందరం పాపాత్ముల మైనట్టు....రాత్రులు ఏం చేస్తున్నారు మీరు?"

"మేమేం మహనీయుల మనలేదే! నువ్వనడమేగాని!"

"మరి బోధిస్తారుగా!"

"అవును. జీవితం అశాంతి గనక. భక్తిలో శాంతి ఉంది అని ఉద్బోధిస్తాము. అబద్ధమా? మాయే కానీ, ఆ పూజలూ భక్తీ లేకపోతే, ఇంతమందీ మనుష్యులు ఒకచోట చేరి ఏళ్ళకొలదీ ఇంత శాంతంగా హాయిగా బతకగలగడం ఆలోచించుకోగలవా?"

"కాని ఇది వుత్త నల్లమందు."

"కానీ, మీ అధికారాలూ, కీర్తులూ, ధనాలూ, కళలూ, అన్నీ ఎంత నల్ల మందు, పైగా ఏ సుఖమూ ఇవ్వని మందు."

"అంతేనంటావా జీవితం?"

ఇంతలో మధురం వొచ్చింది శ్రీధరుని నెత్తుక్కుంటూ, ఆమె అసలు ఎవరో అప్పుడు నాకు తెలీదు. ఆమెలో ఏమూలా ఏమీ అందం

లేదు. కాని మొత్తంమీద అందవికారమైనది కాదు పైగా ఆమెలో వుత్త సాధారణత్వం, అట్లాంటి మనుషులు మనదేశంలో సర్వసాధారణం. ఆమె వొచ్చి కూచుని ఎక్కడో చూస్తున్నా, మా మాటలు శ్రద్ధగా వింటోంది.

"జీవితం అంతేనని నీకూ తెలుసు. నన్ను వొప్పుకోకపోవడానికి జీవితంలో ఏదో పరమార్థం, వున్నతాదర్శం వుందని వాదిస్తున్నావుగాని, పోనీ, నువ్వు నీ జీవితంలో సాధిస్తున్న పరమ ప్రయోజనమేమిటో తెలుపుదూ?" అన్నాడు శ్రీధర్. నా వొళ్ళు మండింది. అతని మాటల్లో లేదుకాని అతని స్థిరత్వం, అనుమాన రాహిత్యం self complacency superiority సెల్ఫ్ కంప్లసెంసీ సుపిరియారిటీ నన్ను ఉద్రేకితుణ్ణి చేశాయి.

"ఏం మాట్లాడు శ్రీధర్, ఎందుకు పడ్డావో. నీవంటివాడు ఇట్లాంటి దుర్గతికి ఎందుకు దిగాడో నాకు తెలీదు, కాని యీ తర్కమంతా, నీ నిష్ప్రయోజకత్వాన్నీ, సులభ సుఖమార్గాన్నీ, మనో లంపటత్వాన్ని సమర్థించుకోడం కోసం నువ్వు ఆలోచించుకున్న కుయుక్తులు"

మధురం చివాలున చాలా కోపంతోలేచి నుంచుంది.

"శ్రీధర్! ఎందుకు ఆయనతో వాదిస్తావు? ఏదో చెప్పాలని చూస్తావు? ఆ మనిషికి ఏం తెలుసు? ఏం అర్థం చేసుకునే సంస్కారం వుంది? రా" అంది.

నేను భగ్గుమన్నాను.

"నువ్వే. నువ్వే. వీడిపాలిటికి కాళివై నావు. శుభ్రమైన మిత్రుణ్ణి ఆస్కారమైన సంసారిని, దేశభక్తుణ్ణి, ఇట్లాంటి గతికి ఈడ్చుకొచ్చావు. నీ బతుక్కి నువ్వా మాట్లాడడమేనా? దేశంవిడిచి పరిగెత్తుకొచ్చి, అతన్ని నీతో ఈడ్చుకు తెచ్చుకున్నావుగాని, నాలుగు తన్నులతో దెయ్యాన్ని వొదలించినట్టు వొదలించేవాళ్ళం అక్కడైతే" అన్నాను.

నావంక తేరిపార చూసింది.

"పాపం!"

అని శ్రీధర్ చెయ్యిపట్టుకుని అట్లా తోటలోకి తీసికెళ్ళిపోతోంది. పోతోపోతో,

"మీకి శ్రమ ఎందుకు? మీకి బాధ ఎందుకు? మీ పనులు మీరు చూసుకోండి. మీ దేశం పోయి." అంది.

శ్రీధర్ మాట్లాడకండా వెళ్ళిపోతున్నాడు ఆమెతో.

నాకు మరీ హెచ్చింది క్రౌర్యం. నేను పగపట్టనేపట్టను. పట్టానా, నాశనం చేశానే.

వాళ్ళిద్దరి తోవకి అడ్డంగా నుంచున్నాను గులాబి గుబుర్ల మధ్య.

"నిలు. నా మాటలకి జవాబుచెప్పు ముందు. నీకేం లాభం ఇతన్ని ఇట్లా భ్రష్టుణ్ణి చెయ్యడం!" అని అడిగాను.

"అదే. ఆ సంగతే ఎప్పుడన్నా యోచించావా నువ్వు." అంది అంత గట్టిగానూ.

అవును ఎందుకు?

"నాకేం ఈయన తన ఆస్తిని కట్టపెట్టారా? నగలా, చీరలా? ఇంత మాత్రం మనిషి నాకు యీ నాలుగు సముద్రాలమధ్యా దొరక్కనా!"

"మరి ఎందుకు?"

"మరి ఎందుకు?" అని ఎక్కిరించింది.

"మరి ఎందుకు? ఆలోచించు, పదిజన్మల తరవాత ఏ కొంచెమన్నా అర్థాని కొస్తుందేమో? రా శ్రీధర్."

అని నన్ను తోసేసుకుని అతన్ని తీసుకుని వెళ్ళిపోయింది. నిర్ఘాంతపోయి నుంచున్నాను.

ఆ రాత్రి పూజలూ సంకీర్తనలూ జరిగాక, గురువుగారు తన గది లోకి వెళ్ళిపోయినారు. ఎవర్నీ అడక్కుండానే నేను ఆయన వెనకనే గదిలో ప్రవేశించాను.

మూల పెమ్మాలో వొత్తులు వెలుగుతున్నాయి! సాంబ్రాణి కడ్డీల ధూపం. పట్టు పరుపుల మీద, బాలీసుల్ని ఆనుకుని జార్లబడి కళ్ళు మూసుకుని కూచునివున్నారు ఆయన. నేనేమీ పలకరించకండా ఎదురుగా కూచున్నాను. పది నిమిషాలకి గావును నిట్టూర్చి కళ్ళు విప్పి నన్ను చూశాడు.

"ఎవరు?" అన్నాయి ఆయన కళ్ళు.

"నేను తమ ఆశ్రమ అతిథిని. తమని సందర్శించడానికి వొచ్చాను."

"ఇదికాదు సమయం"

"కాని....నాలుగు మాటలు."

"చెప్పన."

"మీ ఆశ్రమంలో...."

"ఆగు నీకు సరిగా సత్కారం జరుగుతోందా? కృష్ణుడి దయను ఏమైనా చవి చూడగలిగావా?"

"తమ దయవల్ల. నేను ప్రస్తుతం మీ ఆశ్రమవాసి శ్రీధర్ సంగతి మాట్లాడడానికి వొచ్చాను. అతనూ నేనూ...."

"అసలు సంగతి క్లుప్తంగా చెప్పు."

"ఆ మధురం అతని భార్యకాదు."

"ఊఁ."

"మీ ఆశ్రమంలో ఇల్లాంటి వ్యవహారం...."

"నీకు ఏం ప్రమేయం?"

"మీకు తెలీదేమోనని...."

"తెలుసు."

"తెలిసి....ఇదేం? లేచివొచ్చిన వాళ్ళ వ్యభిచారగృహమా ఇది? ఈ భక్తి అనేది చాటుపెట్టుకుని...."

"అయిపోయిందా? వెళ్లు, కళ్ళు విప్పిచూసి నేర్చుకో!"

"అతనికి సంసారం, భార్య, పిల్లలు...."

"అదంతా పూర్వజన్మ."

"వాళ్ళని అధోగతిలో వొదిలి...."

"ఏం? వాళ్ళు దరిద్రంలో వున్నారా?"

"లేరులెండి. ఉంటేమాత్రం మీరు...."

"ఇక్కడికి పిలిపిద్దామని."

"శ్రీధర్ గొప్ప దేశ సేవకుడు, వీరుడు...."

"అవును."

"అట్లాంటివాణ్ణి...."

"గొప్ప వైష్ణవ భక్తుడైనాడు."

"ఎందుకు? ఇదా భక్తి? ఎందుకా భక్తి."

"హిందువుడివేనా?"

"కనకనే, మీవంటి సోమరి గుంపులవల్ల నే...."

"నేనా సోమరిని? నేను పడేశ్రమ నువ్వు ఒక్కరోజు...."

"ఎవరికా శ్రమ?"

"ఎవరికా? అంధుడా? కల్మషుడా? నీకు ఎన్ని జన్మలకి జ్ఞానోదయ మవుతుంది? శ్రీకృష్ణ నామ మాధుర్యం చవిచూడని నీ పుటక....పాపం, పాపం."

అంటోవుండగా భక్తులు ప్రవేశించారు. రాత్రికి ఆయన పాద స్పర్శకోసం. గురువు బాలీసుల్ని ఆనుకుని ఠీవిగా ఇట్లా పాదాలు చాచాడు.

అని కోసలరావు తన కాళ్ళనిజాచి వెనక్కి ఆనుకొన్నాడు. చప్పున గొంతుదాకా మాయమైనాడు. అతని వెనక పెద్ద గొయ్యిచేసి వుంచారు జోషువా, సాంబం. దాంటో పడ్డాడు పాపం.

సభలో కలకలం తగ్గింతరవాత.

"అయిందా? ఇంకా వుందా?" అన్నాడు సూరయ్య.

"వినండి మరి—తరవాత కోతుల్లాగు గోతులు తీద్దురుగాని—"

మర్నాడు మధ్యాన్నం శ్రీధర్‌తో అన్నాను.

"ఒరే, నేను వెడుతున్నాను. మిమ్మల్ని ఇంతటితో వొదులుతా ననుకోకు. పత్రికల్లో రాస్తాను. ఉపన్యాసాలిస్తాను. మీ గుట్టు బైటపెట్టి, మీ బతుకులు బాహాటంగా వీధుల్లో ఈడుస్తాను." అన్నాను.

"ఎందుకు?" అంది మధురం చాలా మధురంగా.

"ఇదంతా వుత్త మోసం."

"మీ లోకమే మోసం. మీ బతుకులు, ఉద్యోగాలు, వ్యాపారాలు, అన్నిట్లో ఎంతెంత మోసాలు! మీ మునిసిపాలిటీలు, ప్రభుత్వాలు— అంతా కపటం. అన్యాయ ధనార్జనేకద! ఇంతదూరం వొచ్చి యీ ఆశ్రమంలో మోసం కనిపెట్టారా? చాలా ఘనులు." అంది. ఎంత తృణీకారం ఆ పలుకుల్లో!

రాత్రి గంగవొడ్డున కూచుని నా కోపాన్ని అర్పుకుంటున్నాను చల్లగాలిలో. ఒక వైష్ణవుడు వొచ్చి, "గురువుగారు నిన్ను రమ్మంటున్నారు" అన్నాడు. నేను వెళ్ళేప్పటికి సంకీర్తన జరుగుతోంది. చాలా శ్రావ్యమైన స్వరసమ్మేళనంలో. కృష్ణ విగ్రహం, పక్కన అర్ధనిమీలిత నేత్రుడై గురువు, పద్మాల, జాజి, కురవీకపు పరిమళాలు, గంధం, అత్తరు వత్తులు, హారతి....చాలా రమ్యంగావుంది. గురువుగారు నన్ను దగ్గిర కూచోమని సౌంజ్ఞ చేశాడు.

అట్లా ఆ గానం వింటోవుంటే నా తల దిమ్మెక్కింది. చాలా మధురంగా, కళ్లమూతలు పడ్డాయి. ఏవో శ్రావ్యంలో గాలిలో నా ప్రాణం తేలిపోయినట్టయింది. భూమి, ఈర్ష్యలూ, ద్వేషాలూ, అన్నీ చాలా దూరం. అంతా మాధుర్యం: ప్రేమ, శృంగారం, అనిపించింది.

ఎంతసేపయిందో దేదీప్యమానంగా శ్రీకృష్ణ విగ్రహం నడిచి నాముందుకు వొచ్చి ఆగింది. ఆ విగ్రహం మొహంకదిలి ఏదో చెప్పలేని దయతో, వెలుగుతో నామీద చిరునవ్వుతో చూసింది.

తరవాత అక్కడే నిద్ర.

కళ్ళు తెరిచేప్పటికి ఆ మందిరం తలుపులు మూస్తున్నారు. ఆ మత్తుతోనే బైటికివెళ్ళి పడుకున్నాను. అర్ధరాత్రో ఎప్పుడో మెళకువ వొచ్చింది· చాలా నిర్మలంగా వుంది మనసు. ఆశ్రమ స్వరూపమే మారింది నా మనసులో. అక్కడ ఆ వైష్ణవులందరూ మనుషులకి అందని, అర్థంకాని, ఉన్నతమైన మధురత్వంలో ఓలలాడే ధన్యులని పించింది. .

పెద్ద భయం, ఇంక అక్కడ వున్నానా నేను ఆ ఇంద్రజాలంలో పడతాను. ఇంక నాకు విముక్తి వుండదు. నేను మాలలు ధరించి భజనలు కొడుతో గడిపేస్తాను జీవితాన్ని.

లేచి, సంచిని చంకపెట్టి ఎవరితో చెప్పకండా రైలుస్టేషన్‌కి పరుగు ప్రారంభించాను వెన్నెల, తోట, నా వెనక ఎవరో "ఎక్కడికి పోతావు? ఎంతదూరం పోగలవు నన్ను తప్పించుకుని?" అని నవ్వి పిలుస్తున్నట్ట యింది.

"అక్కడే వుండిపోక ఎందుకు దయచేశావు బాబూ మాకీ అబద్దా లన్నీ చెప్పడానికి" అన్నాడు కలెక్టరు జాలయ్యి.

తోట దాటబోతున్నాను. ఆ చివర పొగడ చెట్టుకింద కూచుని ఉన్నారు ఇద్దరు భక్తులు నిశ్చలంగా. వాళ్ళతో చెప్పి పోదామని సమీ పించాను.

గంగానది ప్రవాహంమీద తళతళలాడే వెన్నెల· చిన్నచిన్న వెన్నెల రేకులు చిందులు తొక్కుతున్నాయి గాలి లేపుతున్న అలలమీద, వెండిచీరెలు కట్టుకున్న కిన్నెరలు నాట్య మాడుతున్నా రనిపించింది. అవతల వొడ్డున అడివి చీకటి మిస్టీరియస్‌గా. మృత్యువు తరవాత జీవితంమల్లే. వెనక ఆశ్రమం తోట. ఎంత ప్రశాంతత ! అతను నిశ్చ

లంగా, కొండ అంత స్థిరంగా, శాశ్వతంగా కూచున్నాడు శ్రీధర్. ఏదో అందాలు చూస్తున్న శాంతమైన చిరునవ్వు, గొప్ప మురళీగానం వింటున్నట్టే. అతని పక్కనే కొంచెం వెనకగా మధురం. ఆమె తన్మయత అతనిలోనా, శ్రీకృష్ణునిలోనా. ఆ అందంలోనా ? లేక అంతా వొకటేనా?

ఏం పుట్టిందో నాకు. ఏమీ ఆలోచించకుండా వాళ్ళముందు సాష్టాంగ పడ్డాను.

మెల్లిగా శ్రీధర్ నా భుజంమీద చెయ్యేశాడు.

"వెడుతున్నాను. శలవు." అన్నాను.

"వెళ్ళి మళ్ళీ తొరగా రా. నీ కోసం చూస్తున్నాడు" అన్నాడు.

"ఎవరు?"

"శ్రీకృష్ణుడు."

లేచి "ధన్యులు" అని వొచ్చేశాను.

నిజంగా తోచింది నాకు. వాళ్ళిద్దరికీ శరీరాలు చాలా అప్రాముఖ్యమని. ఒకరి సహాయంతో ఒకరు. ఆ గురుకృపతో, మన మెరగలేని లోకాల సంచారం నేర్చుకున్నారని."

అని ముగించాడు కోసలరావు కన్నీళ్ళతో.

"మరి ఇప్పుడేమంటావు ఈ నాడు?" అన్నాడు దేనియల్.

"ఏ సంగతి"

"వాళ్ళు ఎందుకు పారిపోయినారో అట్టా?"

"పారిపోలేదు. వెళ్ళారు. వెళ్ళలేదు. అక్కడికి.... అక్కడ ఉన్నారు ఇక్కడ బదులు. ఎట్లానా? ఎందుకా?

ఎందుకు చుక్కలు మిణుకు మంటాయో,
ఎందుకు పువ్వులు విప్పుకుంటాయో,
ఎందుకు శిశువులు చిరునవ్వుతారో,
ఎందుకు మేఘాలు తేలిపోతాయో?

అందుకూ.